

రెండు రోజుల్లో రూ.9 కోట్ల మద్యం

తాగేశారు

● నూతన సంవత్సర సంబరాల జోష్

మదనపల్లె టౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేడుకల సందర్భంగా జిల్లాలో మద్యం ప్రియులు రూ.9 కోట్ల విలువైన మద్యం తాగేశారు. జిల్లాలో 111 మద్యం దుకణాలు, 11 బార్లు, రెండు టూరిజం బార్లు నిర్వహిస్తున్నారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని డిసెంబరు 29వ తేదీ కేవలం రూ.29 లక్షల మద్యం మాత్రమే విక్రయాలు జరిగాయి. కానీ 30వ తేదీ 7,375 లిక్కర్ కేసులు, 3,296 బీరు కేసులు విక్రయాలు జరగ్గా మొత్తం రూ.5,83,78,791 విలువ చేసే మద్యం విక్రయాలు జరిగాయి. డిసెంబరు 31వ తేదీ 3,737 లిక్కర్ కేసులు, 2,926 బీరు కేసులు విక్రయాలు జరిగాయి. ఏడాది చివరి రోజున రూ.3,17,66,118 విలువ చేసే మద్యం విక్రయాలు జరిగాయి. మొత్తం మీద ఏడాది చివరి రెండు రోజులు కలిపి జిల్లాలో రూ.9,01,44,904 విక్రయాలు జరిగాయి. రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల్లో రూ.200 కోట్ల మద్యం విక్రయాలు జరిగితే, అందులో అన్నమయ్య జిల్లాలోనే రూ.9కోట్ల మద్యం విక్రయాలు జరగడం గమనార్హం.

శబరిమల యాత్రలో అపశ్రుతి

● గుండెపోటుతో పెద్దమండ్యం వాసి మృతి


బుజ్జిరెడ్డి (ఫైల్)

పెద్దమండ్యం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : శబరిమల యాత్రలో అపశృతి చోటు చేసుకుంది. అయ్యప్ప భక్తులు శబరిమల యాత్ర ముగించుకుని ఇంటికి తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో పెద్దమండ్యంకు చెందిన అయ్యప్పస్వామి భక్తుడు గుండెపోటుతో మృతి చెందిన సంఘటన గురువారం జరిగింది. తోటి అయ్యప్ప భక్తులు, మృతుడి కుటుంబ సభ్యుల వివరాల మేరకు... పెద్దమండ్యంకు చెందిన ఎం.బుజ్జిరెడ్డి (50) అయ్యప్ప స్వామి మాలను ధరించారు. అయ్యప్పస్వామి దర్శనం కోసం గత శనివారం భక్తబృందంతో బస్సులో శబరిమల వెళ్లారు. అయ్యప్ప స్వామి దర్శనం అనంతరం తిరుగు ప్రయాణంలో గురువారం ఉదయం అల్పాహారం, భోజనం తయారు చేసేందుకు తమిళనాడు రాష్ట్రంలోని పళణి వద్ద బస్సును ఆపారు. అంతలోనే పెద్దమండ్యంకు చెందిన భక్తుడు బుజ్జిరెడ్డికి గుండెపోటు వచ్చినట్లు తోటి భక్తులు తెలిపారు. పళణిలోని ఆసుపత్రికి తరలించగానే మృతి చెందినట్లు వారు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పెద్దమండ్యంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఏఎన్ఎం సస్పెన్షన్

● పింఛన్ల పంపిణీలో చేతివాటం

● రూ.100 వసూలు

రాయచోటిటౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ సామాజిక భరోసా పింఛన్ల పంపిణీలో చేతివాటం ప్రదర్శించిన ఏఎన్ఎంను సస్పెండ్ చేస్తూ డీఎంహెచ్‌వో ఉత్తర్వులు జారీ చేశారు. వివరాలిలా ఉన్నాయి. రాయచోటి మున్సిపల్ పరిధిలో పింఛన్ల పంపిణీ సందర్భంగా అవినీతికి పాల్పడుతున్నట్లు కొంతమంది నుంచి కలెక్టర్ చామకూరి శ్రీధర్‌కు ఫిర్యాదులు అందాయి. ఈ విషయమై కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేయగా రాయచోటి మున్సిపల్ పరిధిలోని మూడవ వార్డు ఏఎన్ఎం రూ.100 చొప్పున పింఛనర్ల దగ్గర నుంచి వసూలు చేసినట్లు తేలింది. అవినీతికి పాల్పడిన ఆ ఏఎన్ఎంను సస్పెండ్ చేయాలని మున్సిపల్ కమిషనర్‌తో పాటు డీఎంహెచ్‌వోలకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు రాయచోటి మున్సిపల్ కమిషనర్ వాసుబాబు ఇచ్చిన నివేదిక ఆధారంగా గురువారం ఏఎన్ఎంను సస్పెండ్ చేశారు. పేదలకు ఆర్థిక భరోసా అందించే ఇటువంటి కార్యక్రమాల్లో ప్రభుత్వ నియమ నిబంధనలను ఉల్లంఘించి ఎవరైనా ఇటువంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.


వైసీపీ నేతల దౌర్జన్యకాండ

● నిన్న గాలివీడు.. నేడు ములకలచెరువు..

● ఎంపీడీవోలపై వైసీపీ నాయకుల దౌర్జన్యం

● గత ప్రభుత్వంలో మాదిరే బరితెగింపు


ములకలచెరువు ఎంపీడీవో హరినారాయణపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జడ్పీటీసీ మోహన్‌రెడ్డి, ఎంపీటీసీలు


గాలివీడు ఎంపీడీవో కార్యాలయంలో వైసీపీ నేతల దౌర్జన్యకాండ (ఫైల్)


పీలేరు సర్వేయర్ రెడ్డెప్పపై వైసీపీ నాయకులు దాడి చేస్తున్న దృశ్యం (ఫైల్)

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు బరితెగిస్తున్నారు. అధికారులపై వారి దౌర్జన్యకాండలు ఆగడం లేదు. వైసీపీ ప్రభుత్వ హయాంలో చెలరేగిపోయిన వారు కూటమి ప్రభుత్వంలోనూ అధికారులపై పెత్తనం చెలాయించాలని చూస్తున్నా రు. గత వారంలో గాలివీడు మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) జగహర్‌బాబుపై వైసీపీ నాయకుడు, మాజీ ఎంపీపీ జల్లా సుదర్శన్‌రెడ్డి దాడి చేసిన సం ఘటన మర్చిపోకముందే ములకలచెరువు మండల అభివృద్ధి అధికారి హరినారాయణపై ములకలచెరువు జడ్పీటీసీ సభ్యుడు దాసరిపల్లె మోహన్‌రెడ్డి గురువారం దుర్భాషలాడి, దురుసుగా ప్రవర్తించారు. ఈ సంఘటనపై ఎంపీడీవో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గత వైసీపీ ప్రభుత్వంలో చేసినట్లే ఇప్పుడు కూడా అధికారులను బెదిరించి, తాము చెప్పినట్లు వినేలా చేసుకోవాలని వైసీపీ నాయకులు బరితెగించి అధికారులపై దాడులకు పాల్పడుతున్నారని పలువురు విమర్శిస్తున్నారు. గాలివీడులో దళిత ఎంపీడీవో జవహర్‌బాబుపై వైసీపీ నాయకులు దారుణంగా దాడి చేసి గొంతు మీద కాలేసి తొక్కిన విషయం తెలిసిందే. ఈ సంఘటనను తీవ్రంగా పరిగణించిన రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ కడపకు వచ్చి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎంపీడీవోను పరామర్శించారు. అనంతరం గాలివీడుకు వచ్చి ఎంపీడీవోపైన దాడి జరిగిన కార్యాలయాన్ని పరిశీలించారు. అధికారులపైన ఎవరు దాడులకు దిగినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అయితే ఉపముఖ్యమంత్రి హెచ్చరికలను వైసీపీ నాయకులు తేలికగా తీసుకున్నట్లు ఉన్నారు.

ములకలచెరువు మండల సర్వసభ్య సమావేశాన్ని కోర్టు ఆదేశాల మేరకు గురువారం ఉదయం 10.30 గంటలకు నిర్వహించేందుకు మం డల పరిషత్ సభాభవనంలో అధికారులు ఏర్పాట్లు చేశారు. అయితే ఈ సమావేశానికి అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, ఎంపీటీసీ సభ్యులు ఎవరూ హాజరు కాకపోవడంతో సమయానికి కోరం లేకపోవడంతో సమావేశాన్ని 11 గంటలకు ఎంపీడీవో వాయిదా వేశారు. అయితే 11.05 గంటల ప్రాంతంలో ములకలచెరువు జడ్పీటీసీ సభ్యుడు మోహన్‌రెడ్డి, కొంత మంది ఎంపీటీసీ సభ్యులు ఎంపీడీవో కార్యాలయం లోకి వెళ్లి సమావేశాన్ని ఎలా వాయిదా వేస్తారని, మాకు ఫోన్ చేయాలని తెలియదా.. నీవు ఏం పీకు తున్నావని ఎంపీడీవోను నానా దుర్భాషలాడారు. సిబ్బంది, పోలీసులు చూస్తుండగానే ఎంపీడీవో చేతిలోని మినిట్స్ పుస్తకాన్ని లాక్కున్నారు. తర్వాత పోలీసుల జోక్యంతో మినిట్స్ పుస్తకాన్ని తిరిగి ఇచ్చే శారు. ఈ సంఘటనపై ఎంపీడీవో ములకలచెరువు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనతో అధికారులు హడలిపోతున్నారు. గత ప్రభుత్వంలో అధికారులు పూర్తి స్థాయిలో స్థానిక వైసీపీ నాయకులు చెప్పినట్లే నడుచుకోవాల్సి ఉండేది. ఆయా నాయకులు చెప్పిన పనిచేయడం, చేయమన్న చోట సంతకం చేయడమే అధికారుల విధిగా ఉండేది. అయితే వైసీపీ ప్రభుత్వం మారి కూటమి ప్రభుత్వం ఏర్పడినా ఇప్పటికీ వైసీపీ నాయకులు పలుచోట్ల అధికారులపైన దాడులకు దిగుతున్నారు. తాము చెప్పినట్లు వినాల్సిందేనని అధికారులను బెదిరిస్తున్నారు. గత ప్రభుత్వంలో జిల్లాలో అధికారులపై జరిగిన దాడులలో మచ్చుకు కొన్ని..

● పీలేరు మండలం బోడుమల్లువారిపల్లె పంచాయతీ పరిధిలోని వివాదాస్పద భూమికి సంబంధించి తనకు అనుకూలంగా వ్యవహరించడం లేదంటూ 2022 డిసెంబరు 20వ తేదీ కలికిరి మండలానికి చెందిన వైసీపీ నేత సోమశేఖర్‌రెడ్డి అప్పటి పీలేరు తహసీల్దార్ రవిని తహసీల్దార్ కార్యాలయంలోనే బూతులు తిట్టారు, తనకు అనుకూలంగా వ్యవహరించకపోతే..అంతు చూస్తానంటూ.. బెదిరించాడు. దీనిపై తహసీల్దార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

● పీలేరు మండలం దొడ్డిపల్లె పంచాయతీలో ఓ వివాదాస్పద భూమిపై తమకు ఎంజాయ్‌మెంట్ సర్టిఫికెట్ ఇవ్వలేదన్న కోపంతో సర్వేయర్ రవిపైన సోదరులైన వైసీపీ నాయకులు అనిల్‌కుమార్‌రెడ్డి, సునీల్‌కుమార్‌రెడ్డిలు 2023 అక్టోబరు 28న సర్వే యర్ గదిలోనే దాడి చేసి పిడిగుద్దులు కురిపించారు.

● రాయచోటి పట్టణంలోని మున్సిపల్ కమిషనర్ రాంబాబుపైన 2022లో అప్పటి వైసీపీ కౌన్సిలర్లు నరసింహారెడ్డి అనుచరులు బిల్డింగ్ అప్రూవల్ విష యంలో దాడి చేశారు. ఈ సంఘటనపై పోలీసులకు కమిషనర్ ఫిర్యాదు చేశారు. కేసు కోర్టులో ఉంది.

● రాయచోటి పట్టణంలోని శివరామాలయం వీధి అంగన్‌వాడీ కేంద్రం ఆయా బదిలీ విషయంలో ప్ర భుత్వ నిబంధనలకు విరుద్ధంగా బదిలీ చేయడాని కి ఒప్పుకోకపోవడంతో 2023లో అప్పటి వైసీపీ సీనియర్ నాయకుడు పోలుసుబ్బారెడ్డి అనుచరులు ఐ సీడీఎస్ ప్రాజెక్టు సీనియర్ అసిస్టెంట్‌పైన దాడికి పాల్పడ్డారు. దీంతో ఆయన సెలవుపై వెళ్లిపోయారు.

ఎంపీడీవోపై దాడికేసులో నిందితులకు బెయిల్ మంజూరు

కడప రూరల్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): గాలివీడు ఎంపీడీవో జవహర్‌బాబుపై జరిగిన దాడి కేసులో వైసీపీ నేతలు ఏ-1 జల్లా సుదర్శన్‌రెడ్డితో పాటు ఏ-5 నల్లబత్తిన వెంకటరెడ్డి, ఏ-13 కుడుముల బయ్యారెడ్డిలకు గురువారం నాల్గవ అదనపు జిల్లా కోర్టు(ఎస్సీఎస్టీ కోర్టు) న్యాయమూర్తి జి.దీనబాబు బెయిల్ మంజూరు చేశారు. ఎంపీడీవోపై దాడి ఘటనలో జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్న వీరు ముగ్గురూ ఎస్సీ, ఎస్టీ కోర్టులో దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లపై గురువారం వాదనలు జరిగాయి. పిటీషనర్ల తరుపు న్యాయవాది వాదనలు వినిపించారు. పిటిషనర్ ఏ-1 ఏపీ ప్రాసిక్యూషన్ డైరెక్టర్‌గా, న్యాయవాదిగా పనిచేశారన్నారు. గౌరవప్రదమైన వ్యక్తి అని అతనితో పాటు ఏ-5, ఏ-13 నిందితులకు కూడా బెయిల్ మంజూరు చేయాలని కోర్టును అభ్యర్థించారు. అయితే స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బెయిల్ దరఖాస్తును వ్యతిరేకిస్తూ కౌంటర్ దాఖలు చేశారు. గాలివీడు ఎంపీడీవో కార్యాలయంలో విధుల్లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగిపై దాడిచేయడం దారుణమైన కేసు అని కోర్టుకు విన్నవించారు. ఏపీ ప్రాసిక్యూషన్ డైరెక్టర్‌గా పనిచేసిన నిందుతుడు జల్లా సుదర్శన్‌రెడ్డి అతని అనుచరులు ఎంపీడీవోను కులం పేరుతో అసభ్య పదజాలంతో దుర్భాషలాడడమే కాకుండా పరిణామాలు తీవ్రంగా ఉంటాయని బెదిరించారన్నారు. నిందితులకు బలమైన రాజకీయ నేపథ్యం ఉన్నందువలన వారు సాక్షులను తారుమారు చేస్తారన్నారు. కాబట్టి బెయిల్ కొట్టివేయాలని కోర్టును కోరారు. ఇరు పక్షాల వాదనలను విన్న జడ్జి దీనబాబు పిటిషనర్లు ముగ్గురూ బెయిల్‌కు అర్హులని తెలుస్తోందన్నారు. దర్యాప్తునకు సహకరించాలని ఆదేశిస్తూ, రూ.20వేల వ్యక్తిగత బాండును సమర్పించాలంటూ బెయిల్‌కు ఆదేశాలు జారీ చేశారు.

జూనియర్ కళాశాలల్లో
మధ్యాహ్న భోజనం రేపటికి వాయిదా

కలికిరి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): జూనియర్ కళాశాలల్లోని ఇంటర్మీడియట్ విద్యార్థుల కోసం శుక్రవారం నుంచి ప్రారంభం కావలసిన మధ్యాహ్న భోజన పథకం శనివారానికి వాయిదా పడింది. ఈనెల 4వ తేదీ ఈ పథకాన్ని అన్ని జూనియర్ కళాశాలల్లో ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని డైరెక్టర్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కళాశాలల ప్రిన్సిపాళ్లను గురువారం ఆదేశించారు. శనివారం నుంచి అమల్లోకి తెచ్చేందుకు ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు సన్నాహాలు చేసుకుంటున్నారు. జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం అమలు కోసం అనుమతులు జారీ చేస్తూ మంగళవారం ప్రభుత్వం జీవో నెం.40 జారీ చేసింది. పథకం అమలు విధివిధానాలను కూడా ప్రభుత్వం అందులో వివరించింది. ఆ మరుసటి రోజు అంటే బుధవారం నుంచి ప్రారంభించాలని అందులో ఆదేశించారు. ఇందుకనువుగా ఈ విద్యా సంవత్సరానికి అవసరమైన బడ్జెట్ రూ.27.39 కోట్లు కూడా మంజూరు చేసింది. అయితే మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ మృతి కారణంగా సంతాప దినాలు అమలులో ఉండటంతో 3వ తేదీ అమలు చేసేందుకు ప్రయత్నించారు. వివిధ కారణాల రీత్యా ఇది శనివారానికి వాయిదా పడింది. పాఠశాలల విద్యార్థులకు అందజేస్తున్న మెనూ ప్రకారమే ఇంటర్మీడియట్ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజనం అందజేయాలని ప్రభుత్వం సూచించింది. కాగా జిల్లాలోని కొన్ని మండలాల్లో ఇస్కాన్ ద్వారా కేంద్రీకృత వంటశాలల్లో తయారు చేసిన పదార్థాలను ఆయా పాఠశాలలకు సరఫరా చేస్తున్నారు. ఇక మిగిలిన ఇతరత్రా మండలాల్లో స్థానిక పాఠశాలల్లో వంట మనుషులను ఏర్పాటు చేసుకుని తయారు చేస్తున్నారు. ఇస్కాన్ సరఫరా చేస్తున్న మండలాల్లోని జూనియర్ కళాశాలలకు కూడా యథాతథంగా అదే భోజనాన్ని అందజేయనున్నారు.

పక్కాగా పింఛన్ల ధ్రువీకరణ పరిశీలన

● వైద్య బృందం ప్రతి ఇంటిని సందర్శించాలి ● కలెక్టర్ చామకూరి శ్రీధర్


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్


రాయచోటి (కలెక్టరేట్), జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం జారీ చేసే మార్గదర్శకాల మేరకు జిల్లాలో వికలాంగుల పింఛన్ల ధ్రువీకరణ పరిశీలన కార్యక్రమాన్ని పక్కాగా చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం విజయవాడ నుంచి వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు, గ్రామీణ అభివృద్ధి ప్రత్యేక కార్యదర్శి శశిభూషణ్‌కుమార్, సెర్ప్ సీఈవో వీర్యపాండ్యన్, సదరం వైకల్య ధ్రువీకరణ పత్రాల స్క్రీనింగ్ నూతన మార్గదర్శకాలపై కలెక్టర్లు, డీఆర్‌డీఏ, వైద్య ఆరోగ్య, మున్సిపల్, జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సెర్ప్ సీఈవో వీర్యపాండ్యన్ ప్రభుత్వం ద్వారా జారీ చేయనున్న నూతన మార్గదర్శకాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ప్రతి జిల్లాలో వైద్య బృందాల ద్వారా సదరం వైకల్య ధ్రువీకరణ పత్రాల పరిశీలనను పూర్తి చేయాలని కలెక్టర్లకు సూచించారు. సమావేశం అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేయనున్న మార్గదర్శకాలను అనుసరించి సదరం వైకల్య ధ్రువీకరణ పత్రాల స్క్రీనింగ్ నిమిత్తం జిల్లా స్థాయిలో ఒక బృందాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. వీరి ఆధ్వర్యంలో వివిధ మండల స్థాయి బృందాలను ఏర్పాటు చేస్తారన్నారు. 85 శాతం, 40 శాతం వికలత్వం పైబడిన రెండు కేటగిరీలలో పరిశీలన పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు.

ప్రస్తుతం జిల్లాలో దాదాపు 1600 మంది వరకు 85 శాతం పైబడి వైకల త్వం కలిగిన వారు ఉన్నట్లు నివేదికలు చెబుతున్నాయని, వైద్య బృందం ప్రతి ఇంటిని పరిశీలించాలని తెలిపారు. ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల మేరకు బృందాల ఏర్పాటు నిమిత్తం డీఎంహెచ్‌వో, డీసీహెచ్ఎస్, కడప జీజీహెచ్ సూపరింటెండెంట్‌లతో సమన్వయం చేసుకోవాలని, అలాగే క్షేత్రస్థాయిలో పరిశీలనకు వెళ్లే బృందాలకు సరైన వసతి సౌకర్యాలు ఉండేలా తగు చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీఏ పీడీని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ, వైద్య ఆరోగ్య, పంచాయతీ, జీఎస్‌డబ్ల్యూఎస్ జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

నీరున్నా.. ప్రయోజనం సున్నా..

● అందని ద్రాక్షలా ఝరికోన ప్రాజెక్టు ● నిలిచిపోయిన కాలువల పనులు

● 15 ఏళ్లుగా రైతులకు ఎదురుచూపులే.. ● కూటమి ప్రభుత్వంపైనే రైతుల భారం


ఝరికోన ప్రాజెక్టు

సంబేపల్లె, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కరువుకు నిలయం ఈ ప్రాంతం. ఇక్కడ రైతులు వర్షాలపై ఆధారపడి మెట్ట భూముల్లో పంటలు సాగు చేస్తారు. ప్రకృతి విపత్తులు, ప్రతియేటా నష్టాలు కరువు నుంచి రైతులను ఆదుకునేందుకు ఝరికోన ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారు. ప్రాజెక్టు పూర్తయి 15 ఏళ్లు అవుతున్నా ఈ ప్రాంత రైతులకు మాత్రం ఎటువంటి ప్రయోజనం లేదు. ప్రాజెక్టు నిండా నీళ్లు ఉన్నా అందని ద్రాక్షగా మారిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఝరికోన ప్రాజెక్టు పేరు చెప్పగానే గుర్తొచ్చే మండలం సంబేపల్లె. ఇక్కడ రైతుల ప్రయోజనాల కోసం 2006 జూన్‌లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి బాహుదానదిపై 0.5 టీఎంసీల సామర్థ్యంతో రూ.18 కోట్లతో వల్లబండపల్లె వద్ద ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారు. సంబేపల్లె, సుండుపల్లె, కేవీ పల్లి మండలాల్లో 5 వేల ఎకరాలకు సాగునీరు, రాయచోటి ప్రాంతానికి 0.43 టీఎంసీల సామర్థ్యంతో తాగునీరు ఇవ్వాలన్న లక్ష్యంతో ఈ ప్రాజెక్టు నిర్మాణం 2009 నాటికి పూర్తయ్యింది. లెఫ్ట్ కెనాల్ ద్వారా సంబేపల్లె మండలంలో 3500 ఎకరాలు, రైట్ కెనాల్ ద్వారా కేవీపల్లి, సుండుపల్లె మండలాల్లో 1500 ఎకరాలకు తాగునీరు అందించాలి. సుండుపల్లె మండల రైతులు, తూము (స్లూయజ్) ఏర్పాటుకు పట్టుబట్టడంతో 350 క్యూసెక్కుల నీరు బాహుదానది పరివాహక ప్రాంతంలో పారేలా గేటు ఏర్పాటు చేశారు. ప్రాజెక్టు పూర్తయినా సంబేపల్లె రైతులకు మాత్రం ఎటువంటి ప్రయోజనం లేకుండాపోయింది. తరువాత జరిగిన పరిణామాలతో ప్రాజెక్టు లక్ష్యం నీరుగారిపోయింది.

మూడు మండలాలకు తాగునీరు

2012-13లో అప్పటి ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని కలకడ, కలికిరి, కేవీపల్లి మండలాల్లో తాగునీటి కోసం రూ.58 కోట్లతో గ్రావిటీ వాటర్ తరలింపు చేపట్టారు. ప్రాజెక్టు లక్ష్యంలో రాయచోటికి తాగునీరు కల్పించాల్సి ఉండగా వెలిగల్లు, గుంటిమడుగు నీటి పథకాల ద్వారా తాగునీరు రావడంతో దీనిని వదిలేశారు. ప్రాజెక్టు ఆనుకుని ఉన్న సంబేపల్లె, చిన్నమండెం మండలాల్లో శాశ్వత తాగునీటి సమస్య పరిష్కరించాలంటే ప్రాజెక్టుల ద్వారా కల్పించడమే మార్గం. ప్రస్తుతం భూగర్భజలాలు అడుగంటిపోవడంతో కోట్ల రూపాయలు ఖర్చు చేసి బోర్లు వేస్తున్నా గ్రామాల్లో నీటి సమస్యలు తీరడం లేదు. సంబేపల్లె రైతులకు ఏకైక ప్రాజెక్టుగా ఉన్న ఈ ప్రాంతం నుంచి తాగునీరు, సాగునీరు కల్పించాలని కోరుతున్నారు.

రూ.47.25 కోట్లతో కాలువల పనులు

ఝరికోన ప్రాజెక్టు ద్వారా సంబేపల్లె, సుండుపల్లె, కేవీపల్లి మండలాల్లో 5వేల ఎకరాల సాగునీటి కోసం రైట్, లెఫ్ట్, కెనాల్ నిర్మాణానికి 2019లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాలువల నిర్మాణం కోసం రూ.47.25 కోట్లు మంజూరు చేసినా పనులు మాత్రం జరగలేదు. పనులు జరగక సాగు నీరు అందక ప్రాజెక్టు లక్ష్యం నీరుగారిపోయింది. ప్రాజెక్టు నిండా నీళ్లున్నా ఒక్క ఎకరాకు కూడా నీరు అందడం లేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనైనా కాలువలు పూర్తి చేసి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా రైతులకు సాగునీరు అందించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

కాలువలు పూర్తి చేసి సాగునీరు అందించాలి..



ఝరికోన ప్రాజెక్టు కాలువలు పూర్తి చేసి ఈ ప్రాంత రైతులకు సాగునీరు అందించాలి. వర్షాలు పడితే కానీ ఈ ప్రాంతంలో పంటలు సాగు చేయని పరిస్థితిలో ఉన్నాం. ప్రాజెక్టులో నీరు ఉండి పాలకుల నిర్లక్ష్యంతో అందడం లేదు. బోర్లు వేసినా ఫలితం లేదు. సాగు నీరు కల్పించి రైతన్నలను ఆదుకోవాలి.

- కేతంరెడ్డి రవీంద్రారెడ్డి, శెట్టిపల్లె, పెద్దచెరువు నీటి సంఘం అధ్యక్షుడు

తాగునీటికి ఇబ్బందులు పడుతున్నాం



ప్రాజెక్టు ప్రాంతానికి దగ్గరలో ఉన్నా గ్రామంలో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నాం. లక్షలు పెట్టి బోర్లు వేసినా భూగర్భ జలం అడుగంటిపోవడంతో బోరుబావులు వట్టిపోతున్నాయి. మండల ప్రజలకు తాగునీరు కల్పించేలా శాశ్వత తాగునీటి పథకం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి.

- ఆనంద్‌నాయక్, పెద్దబిడికి




సుండుపల్లె మండల ప్రజల కోసం ఏర్పాటు చేసిన తూము.. అధ్వానంగా ఉన్న కాలువలు

అబలలకు ‘ఉల్లాస్’

● నిరక్షరాస్యులైన మహిళలకు రాత్రి బడులు

● ఆర్థిక, సామాజిక, డిజిటల్ విధానంపై బోధన

6



మృతదేహంతో ఆస్పత్రి ఎదుట నిరసన


6
మృతదేహంతో నిరసన తెలుపుతున్న మృతుడి కుటుంబసభ్యులు

సేంద్రియ వ్యవసాయానికి ఐటీసీ వెన్నుదన్ను

వివరాలు.....6లో

అబలలకు 'ఉల్లాస్'



- నిరక్షరాస్యులైన మహిళలకు రాత్రి బడులు
- ఆర్థిక, సామాజిక, డిజిటల్ విధానంపై బోధన
- జిల్లాలో 23,470 మంది ఎంపిక

కడప ఎడ్యుకేషన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోంది. నిరక్షరాస్యులైన మహిళల్లో అక్షర వెలుగులు నింపేందుకు చర్యలు చేపట్టింది. ప్రస్తుత రోజుల్లో పల్లె, పట్టణం తేడా లేకుండా ఎక్కడ చూసిన డిజిటల్, సాంకేతికత, నగదు రహిత లావాదేవీలు కొనసాగుతున్నాయి. పొదుపు సంఘాల్లో మహిళలకు ఇవన్నీ నేర్చుకోవడం ఎంతో అవసరం. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఉల్లాస్ (అండర్‌స్టాండింగ్ ఆఫ్ లైఫ్‌లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) అనే కార్యక్రమం తీసుకొస్తోంది. ఇందులో భాగంగా ఆర్థిక సామాజిక డిజిటల్ అక్షరాస్యతపై మహిళలకు తరగతులు నిర్వహిస్తోంది. బ్యాంకు ఖాతాలున్న వారికి వాటి నిర్వహణపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ ఉద్దేశం. జిల్లాలో డ్వాక్రా మహిళలతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో ఆయాలు, వంట పని చేసే వారికి ఈ పథకం అమలు చేయనున్నారు.

ఉల్లాస్ కార్యక్రమాన్ని న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రాం (ఎన్ఐఎల్‌పీ) అని కూడా అంటారు. ఇది జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) 2020కి అనుగుణంగా ఉండే కేంద్ర ప్రాయోజిత కార్యక్రమం. 15 ఏళ్లు అంతకంటే ఎక్కువ వయసు ఉన్న పెద్దలకు సాధికారత కల్పించడం, పాఠశాల విద్య అందించడం దీని లక్ష్యం. చదవడం, రాయడం, సంఖ్యా నైపుణ్యాలతో సహా క్రియాత్మక అక్షరాస్యతను అందించడంపై దృష్టి పెడుతుంది. జీవితకాల అభ్యాసాన్ని పెంపొందించడం ద్వారా అభ్యాసకులను క్లిష్టమైన జీవిత నైపుణ్యాలతో సుసంపన్నం చేస్తుంది. ముఖ్యంగా ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత, లీగల్ అక్షరాస్యత, క్రియాత్మక అక్షరాస్యత గురించి విద్యను 15 ఏళ్లు అంతకంటే ఎక్కువ వయసు ఉన్న పెద్దలకు అందిస్తారు. రాష్ట్రంలోని మొత్తం 26 జిల్లాల్లో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అమలు చేయనున్నారు. ఎస్‌హెచ్‌సీ లబ్ధిదారులు అన్ని ప్రభుత్వ ఎంపీపీఎస్, జడ్పీహెచ్ఎస్, ఎయిడెడ్ పాఠశాలల్లోని ఆయాలు, వంటవారు, సహాయకులు, నైట్ వాచ్‌మెన్లు, అంగన్వాడీ హెల్పర్లు ఈ ప్రోగ్రాంలో అభ్యాసకులు. మన రాష్ట్రంలో ఈ ప్రోగ్రాం కాలవ్యవధి మూడు సంవత్సరాలు. ఈ కార్యక్రమానికి చైర్మన్‌గా కలెక్టర్ వ్యవహరిస్తారు. వయోజన విద్య ఉప సంచాలకులు, మెంబర్, కన్వీనర్, సభ్యులుగా ప్రాజెక్టు డైరెక్టర్, డీఆర్‌డీఏ, ఐసీడీఎస్ పీడీ, జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ), జిల్లా విద్యాధికారి (డీఈఓ), జిల్లా ప్రజా సంబంధాల అధికారి (డీపీఆర్ఓ), జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల నోడల్ అధికారి ఉంటారు. పది మంది అభ్యాసకులకు ఒక వలంటరీ టీచర్ ద్వారా చదువు నేర్పిస్తారు. విద్యావంతులైన విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లు (వీఓఏ)లు క్లస్టర్ ఎస్‌హెచ్‌జీల రీసోర్స్ పర్సన్లు వలంటీర్ టీచర్లుగా వ్యవహరిస్తారు. ప్రతి వలంటీర్ టీచర్ పది మంది అభ్యాసకులతో మ్యాపింగ్ చేస్తారు. ఈ కార్యక్రమం అంగన్వాడీ కేంద్రంలో సాయంత్రం రెండు గంటలు నిర్వహిస్తారు. మొత్తం ఆరు నెలలకు గాను వంద రోజులు ఈ కార్యక్రమం ఉంటుంది. గ్రామస్థాయిలో కార్యక్రమం సమన్వయాన్ని విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్ (వీఓఏ) పర్యవేక్షిస్తారు. క్లస్టర్ కోఆర్డినేటర్ (సీసీ), ఎస్ఈఆర్‌పీ, వీఓఏ, సీసీ కార్యక్రమం సమన్వయ ప్రయత్నాలకు నాయకత్వం వహిస్తారు. మండల స్థాయిలో ఈ కార్యక్రమాన్ని ఎంపీడీఓ, అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ (ఏపీఎం), సెర్ప్, వయోజన విద్యాశాఖ పర్యవేక్షకులు పర్యవేక్షిస్తారు. డివిజనల్ స్థాయిలో ఈ కార్యక్రమాన్ని అసిస్టెంట్ ప్రాజెక్టు ఆఫీసర్ (ఏపీఓ), వయోజన విద్యా విభాగం సూపర్వైజర్ నిర్వహిస్తారు. కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి కమిటీ మద్దతుతో వయోజన విద్య శాఖ డిప్యూటీ డైరెక్టర్, అసిస్టెంట్ డైరెక్టర్, పీడీ, డీఆర్‌డీఏ, జిల్లాస్థాయిలో కార్యక్రమాన్ని అమలు చేయడానికి బాధ్యత వహిస్తారు. అక్షరాస్యత తరగతులు పూర్తైన తర్వాత, మార్చిలో జరిగే నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూల్ (ఎన్ఐఓఎస్) ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ (ఏపీఓఎస్ఎస్) ద్వారా అసెస్‌మెంట్ పరీక్ష నిర్వహించుట ద్వారా ఈ కార్యక్రమం పూర్తవుతుంది.

ఎంతో ఉపయోగకరం



ఉల్లాస్ కార్యక్రమం నిరక్షరాస్యులైన మహిళలకు ఎంతో ఉపయోగకరం. వారికి చదవడం, రాయడంతో పాటు డిజిటల్ లావాదేవీలపై కూడా పూర్తి అవగాహన కల్పిస్తారు. అలాగే సమాజం పట్ల అవగాహనతో పాటు ఆరోగ్యం, నైతిక విలువలు లాంటి అనేక అంశాలపై కూడా అవగాహన కల్పిస్తాము. ఇప్పటికే ఉల్లాస్ కార్యక్రమానికి సంబంధించి జిల్లా, మండల స్థాయిలలో పలు కమిటీలను ఏర్పాటు చేశాం. పుస్తకాల ప్రింటింగ్ కూడా పూర్తయింది. మరో వారం రోజులల్లోపు జిల్లాకు పుస్తకాలు రానున్నాయి. వచ్చిన వెంటనే కార్యక్రమాన్ని జిల్లాలో ప్రారంభిస్తాం.

- సుబ్బారెడ్డి, వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్, కడప

జిల్లాలో 23,470 మంది ఎంపిక

డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి జిల్లాలోని 35 మండలాల్లో 23,470 మందిని ఎంపిక చేశారు. ప్రతి పది మందికి ఒక వలంటీర్ చొప్పున 2347 మందిని ఎంపిక చేశారు. డ్వాక్రా సభ్యులతో పాటు మండల, జిల్లా పరిషత్తు, ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలు, సహాయకులు, వంట పనివాళ్లు, రాత్రి కాపలాదారులు, అంగన్వాడీ కేంద్రాల్లోని ఆయాలు, నిరక్షరాస్యులను ఎంపిక చేసి మార్చి 15 వరకు తరగతులు బోధిస్తారు. శిక్షణ అనంతరం వీరికి పరీక్షలు నిర్వహిస్తారు.

ఏం చేస్తారంటే...

మూడేళ్ల పాటు కొనసాగే ఈ కార్యక్రమంలో ప్రతి ఆరు నెలలకు ఒక బృందానికి పాఠాలు బోధిస్తారు. ఆరు నెలలు వ్యవధిలో 200 గంటల పాటు ఆర్థిక, సామాజిక, డిజిటల్ అక్షరాస్యతపై మహిళలకు అభ్యసన తరగతులు నిర్వహిస్తారు. ఇందుకు ప్రతి పది మందికి ఒక వలంటీర్‌ను ఎంపిక చేశారు. వీరిలో స్వచ్ఛందంగా బోధనకు వచ్చే నిరుద్యోగులతో పాటు డ్వాక్రా సంఘాల్లో చదువుకున్న మహిళలు, వీఓఏలు ఉన్నారు. వీరు సాయంత్రం 5 నుంచి 7గంటల మధ్య సమయంలో బోధిస్తారు.

మహిళలకు బోధించాల్సింది ఇదే..

కుటుంబం-ఇరుగుపొరుగు, మన ఆచార వ్యవహారాలు, పరిశుభ్రత-ఆరోగ్యం, ఎన్నికలు, పిల్లల పెంపకం-మన బాధ్యత, చట్టాలు తెలుసుకుందాం, మా ఇంటి మహాలక్ష్మి, డిజిటల్ అక్షరాస్యత ఈ అంశాల చుట్టూ తెలుగు భాష, గణిత దైనందిన వినియోగానికి సంబంధించిన నైపుణ్యాలను పెంపొందించే ఉద్దేశంతో పుస్తకాన్ని రూపొందించారు.

మృతదేహంతో ఆస్పత్రి ఎదుట నిరసన



మృతదేహంతో నిరసన తెలుపుతున్న మృతుడి కుటుంబసభ్యులు

తంబళ్లపల్లె, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): అత్యవసర వైద్య చికిత్సల కోసం ప్రభుత్వాసుపత్రికి వస్తే అంబులెన్సులో నుంచి రోగిని ఆసుపత్రిలోకి తరలించడానికి కూడా సిబ్బంది రాకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని మృతదేహంతో బంధువులు నిరసన తెలిపారు. ఈ సంఘటన తంబళ్లపల్లె మండల కేంద్రంలో గురువారం జరిగింది. బాధితులు తెలిపిన వివరాల మేరకు... తంబళ్లపల్లె మండలం గోపిదిన్నె పంచాయతీ ఉప్పులూరివాండ్లపల్లెకు చెందిన శ్రీరాములునాయక్ (58) గురువారం శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడుతుండటంతో 108లో తంబళ్లపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ క్రమంలో రోగిని అంబులెన్సులో నుంచి కిందకు దించి ఆసుపత్రిలోకి తీసుకువెళ్లడానికి ఆసుపత్రి సిబ్బంది ఎవ్వరూ ముందుకు రాలేదు. అయితే, అప్పటికే (మార్గ మధ్యలో) ఆయన మృతి చెందడంతో 108లో నుంచి కిందకు దింపి ఆసుపత్రిలోకి తరలించడానికి సిబ్బంది ససేమిరా అని.. మీరే తీసుకువెళ్లండి అని చెప్పారు. శ్రీరాములు నాయక్ ప్రాణంతో ఉన్నాడా, లేదా అని పరీక్షించడానికి సైతం ఎవ్వరూ ముందుకు రాకపోగా ఆసుపత్రి బయట స్ట్రెచర్‌పైనే ఉంచడంతో కుటుంబసభ్యులు వైద్య సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసి నిరసన తెలిపారు. దీంతో కొంతసేపటి తర్వాత విధుల్లో ఉన్న వైద్యుడు వచ్చి రోగిని పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. అత్యవసర సమయాల్లో ఆసుపత్రికి వచ్చే రోగులను కూడా సిబ్బంది పట్టించుకోలేదని.. ఇంత పెద్ద ఆసుపత్రిలో రోగులకు ఇక వైద్యం ఏమి అందుతుందని మృతుడి అల్లుడు మాజీ సర్పంచ్ రమణానాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానికులు, కూటమి నాయకులు ఆసుపత్రి వద్దకు చేరుకుని వైద్యులు, సిబ్బంది పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

యోగాసన పోటీల్లో ద్వితీయ స్థానం

- ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి ప్రతిభ

సంబేపల్లె, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): జాతీయ యోగాసన పోటీల్లో ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి ఉత్తమ ప్రతిభ కనబరచినట్లు ఎంఈవో శ్రీనివాసులు తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని సంబేపల్లె హైస్కూల్‌లో కాంప్లెక్స్ ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఝార్ఖండ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో డిసెంబరు 26 నుంచి 31వ తేదీ వరకు 6 రోజుల పాటు జరిగిన 43వ జాతీయ యోగాసన పోటీల్లో ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి పాల్గొని అద్భుత ప్రతిభ కనబరచి ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నట్లు తెలిపారు. ఈమె సంబేపల్లె మండలం గొల్లపల్లి ప్రాథమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంబేపల్లె ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి, కేజీబీవీ ప్రిన్సిపాల్ పద్మావతి, ఉపాధ్యాయులు ప్రభాకర్‌రెడ్డి, చంద్రశేఖర్, సుభాషిణి, జగదీశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయురాలు విజయలక్ష్మిని సన్మానిస్తున్న దృశ్యం

సేంద్రియ వ్యవసాయానికి ఐటీసీ వెన్నుదన్ను



రైతు శివ వ్యవసాయ క్షేత్రంలో ఐటీసీ ప్రతినిధులు

పీలేరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): సేంద్రి య, ప్రకృతి వ్యవసాయానికి తమ సంస్థ వెన్నుదన్నుగా నిలుస్తుందని ఐటీసీ సంస్థ దక్షిణ భారత ఎఫ్‌పీవోల అభివృద్ధి మేనేజర్ పురుషోత్తం తెలిపారు. పూర్తిగా ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో మామిడిని సాగు చేస్తున్న కేవీపల్లె మండలం నూతనకాల్వకు చెందిన రైతు శివ వ్యవసాయక్షేత్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేంద్రియ ఉత్పత్తులకు మార్కెట్‌లో బాగా డిమాండ్ ఉన్నప్పటికీ తగినంత లభ్యత లేకపోవడంతో చాలా మంది రసాయనిక ఉత్పత్తులనే వాడుతున్నారన్నారు.

వారందరికీ సేంద్రియ ఉత్పత్తులను అందుబాటులోకి తేవాలన్న లక్ష్యంతో తమ సంస్థ సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తోందన్నారు. అందులో భాగంగా మామిడి, బొప్పాయి, అరటి పంటల్లో ఇప్పటికే సేంద్రియ, ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటిస్తున్న రైతులను గుర్తించి వారి పంటలను కొనేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. అంతేకాకుండా ఆ మూడు పంటలు సాగుచేసే ఆసక్తి ఉన్న రైతులకు తమ సంస్థ ద్వారా సాంకేతిక శిక్షణ ఇవ్వడంతో పాటు కొంతమేర ఇన్‌పుట్ సబ్సిడీ కూడా అందజేస్తామన్నారు. రెండు, మూడేళ్ల మామిడి తోటలు ఉన్న వారు పూర్తిగా సేంద్రియ పద్ధతిలోకి మారేందుకు కావాల్సిన సాంకేతిక శిక్షణ అందిస్తామన్నారు. తమ పర్యవేక్షణలో పండించిన పంటలను తామే కొనుగోలు చేస్తామని, అలా తమకు అమ్మడానికి ఇష్టపడని రైతు లు వారికి కావాల్సిన చోట అమ్ముకోవచ్చునన్నారు. సేంద్రియ, ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తున్న రైతుల గురించి తాము జరిపిన అన్వేషణలో పీలేరుకు చెందిన ప్రముఖ ప్రకృతి వ్యవసాయ నిపుణుడు బోదేషావలి ద్వారా రైతు శివ గురించి తెలిసి ఆయన వ్యవసాయక్షేత్రాన్ని పరిశీలించామన్నారు. త్వరలోనే శివ వ్యవసాయక్షేత్రాన్ని తమ సాంకేతిక నిపుణుల బృందం పరిశీలిస్తుందని, పీలేరు ప్రాంతంలో తాము ఈ మామిడి సీజన్ నుంచే కార్యకలాపాలు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల రైతులు బోదేషావలిని 9703635827 నెంబరులో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఐటీసీ సంస్థ భాగస్వామి అయిన 'బ్రెడ్స్' ఎన్‌జీవో సీనియర్ మేనేజర్ బోజిరాజు, బోదేషావలి పాల్గొన్నారు.

ములకలచెరువులో టెన్షన్.. టెన్షన్...

- మండల సర్వసభ్య సమావేశంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు
- ఓవైపు టీడీపీ, మరోవైపు వైసీపీ వర్గీయుల మోహరింపు
- ఇరువర్గాల వారిని నిలువరించిన పోలీసులు
- మండల సమావేశం వాయిదా
- ఎంపీడీవోపై వైసీపీ నేతల దౌర్జన్యం
- మినిట్స్ బుక్ లాక్కుని... ఎంపీడీవోపై నానా దుర్భాషలు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన ఎంపీడీవో



మినిట్స్ బుక్‌ను లాక్కున్న వైసీపీ ప్రజాప్రతినిధులను హెచ్చరిస్తున్న ఎస్ఐ నరసింహుడు

ములకలచెరువు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ములకలచెరువు మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం సందర్భంగా గురువారం తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ప్రజాస్వామ్యబద్ధంగా గెలవని వైసీపీ ప్రజాప్రతినిధులకు సమావేశానికి వచ్చే అర్హత లేదని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లె జయచంద్రారెడ్డి సూచనలతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో ఎంపీడీవో కార్యాలయం వద్దకు చేరుకున్నారు. సెలెక్టెడ్ ఎంపీటీసీలు, సర్పంచులు గో బ్యాక్ అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. సమావేశం నిర్వహించేందుకు హైకోర్టు ఉత్తర్వులు ఉన్నాయని సమావేశం నిర్వహించాలని పోలీసులు టీడీపీ శ్రేణులను అడ్డుకున్నారు. అలాగే కార్యాలయం వద్దకు వైసీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా చేరుకున్నారు. టీడీపీ శ్రేణులు ఓవైపు....వైసీపీ నాయకులు మరోవైపు ఉండడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా మదనపల్లె డీఎస్పీ కొండయ్యనాయుడు, ములకలచెరువు, బి.కొత్తకోట, మదనపల్లె, పుంగనూరు సీఐలు, ఎస్ఐలు, పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి ఇరువర్గాలను అదుపు చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రచార సమన్వయకర్త సీడు మల్లికార్జుననాయుడు, బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేవీ రమణ, టీడీపీ నేతలు విశ్వనాథరెడ్డి, కట్టా సురేంద్రనాయుడు, తులసీధర్‌నాయుడు, తంబళ్లపల్లె, కురబలకోట మండలాల టీడీపీ అధ్యక్షుడు రెడ్డెప్పరెడ్డి, వైజీ సురేంద్రయాదవ్ తదితరులు మాట్లాడుతూ దమ్ముంటే ప్రజాస్వామ్యబద్ధంగా గెలిచి సమావేశాలకు రావాలన్నారు. వైసీపీ ప్రజాప్రతినిధులు పుంగనూరు నుంచి రౌడీలను పిలుచుకొచ్చి ఇక్కడ దౌర్జన్యం చేస్తున్నారన్నారు. ఈ క్రమంలో వైసీపీ ప్రజాప్రతినిధులు 11.05 గంటలకు సమావేశానికి హాజరయ్యేందుకు కార్యాలయంలోకి వెళ్లారు. అయితే ఉదయం 10.30 గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశానికి 11 గంటల వరకు సభ్యులు ఎవరూ హాజరు కాకపోవడంతో కోరం లేక సమావేశాన్ని వాయిదా వేసినట్లు ఎంపీడీవో హరినారాయణ ప్రకటించారు. వాయిదా వేసిన ఐదు నిమిషాలకు కార్యాలయంలోకి వచ్చిన వైసీపీ ప్రజాప్రతినిధులు ఆగ్రహంతో ఎండీడీవోపై చిందులు తొక్కారు. తరువాత ఎంపీడీవో ఛాంబర్‌లోకి వెళ్లి మినిట్స్ బుక్‌ను లాక్కొని నానా దుర్భాషలాడారు. సమావేశం వాయిదా వేసే ముందు తమకు ఫోన్ చేసి చెప్పకుండా ఏం పీకుతున్నావు నీవు అంటూ తిట్టారు. దీంతో అక్కడే ఉన్న ఎస్ఐ నరసింహుడు గవర్నమెంట్ ప్రాపర్టీ అయిన మినిట్స్ బుక్‌ను తీసుకునే అర్హత మీకు లేదని, వెంటనే మినిట్స్ బుక్‌ను ఇవ్వాలని హెచ్చరించడంతో కొంతసేపటికి ఇచ్చారు. టీడీపీ నిరసన కార్యక్రమంలో నాయకులు గంగాదేవి, మూగి రవిచంద్ర, భాస్కర్‌రెడ్డి, యల్లారెడ్డి, సిద్ధవరం ప్రసాద్, కిట్టన్న, నారాయణ, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు ఫిర్యాదు చేసిన ఎంపీడీవో

ములకలచెరువు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో జరిగిన వైసీపీ ప్రజాప్రతిధుల దౌర్జన్యంపై ఎంపీడీవో హరినారాయణ గురువారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశంను ఉదయం 10.30 గంటలకు ఏర్పాటు చేశామని, సమావేశంకు అధ్యక్ష, ఉపాధ్యక్షులు, ఎంపీటీసీలు హాజరుకాకపోవడంతో కోరం లేక వాయిదా వేశామని తెలిపారు. తమ కార్యాలయ సిబ్బంది చూస్తుండగా నా వద్ద నుంచి మండల పరిషత్ తీర్మాన పుస్తకాన్ని వైసీపీ జడ్పీటీసీ మోహన్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు లాక్కున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇంతటితో ఆగకుండా నన్ను తిట్టి, భయభ్రాంతులకు గురిచేసి విధులకు ఆటంకం కలిగించారని, ఆ జడ్పీటీసీ, ఎంపీటీసీలు కొంతమందిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు పత్రాన్ని ఎస్ఐ నరసింహుడుకు అందజేశారు.





ఎంపీడీవో కార్యాలయం వద్ద నిరసన తెలియచేస్తున్న టీడీపీ వర్గీయులను అడ్డుకుంటున్న పోలీసులు, మరోవైపు మోహరించిన వైసీపీ వర్గీయులు

గుండెపోటుతో హెడ్‌కానిస్టేబుల్ మృతి



దాసరి భాస్కర్ (ఫైల్)

రాయచోటిటౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న దాసరి భాస్కర్ (51) గురువారం గుండెపోటుతో మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే... లక్కిరెడ్డిపల్లె మండలం గాండ్లవానిపల్లెకు చెందిన హెడ్ కానిస్టేబుల్ దాసరి భాస్కర్ రాయచోటి అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. నాలుగు నెలల క్రితం హైదరాబాదులో గుండె జబ్బుకు చికిత్స చేయించుకుని వచ్చాడు. ఈ క్రమంలో రెండు రోజులు ఆయాసంతో బాధపడుతున్న భాస్కర్‌కు గురువారం మరోసారి గుండె పోటు రావడంతో మృతి చెందాడు.

ఇతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న రాయచోటి అర్బన్ సీఐ చంద్రశేఖర్‌తో పాటు ఎస్ఐలు, సహచర పోలీసులు హెడ్‌కానిస్టేబుల్ మృతదేహాన్ని సందర్శించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు వారి ఇంటి వద్దకు వెళ్లి మృతదేహాన్ని సందర్శించి వారి కుటుంబానికి ధైర్యం చెప్పారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య



పకీర్‌సాబ్ మృతదేహం

రాయచోటిటౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని మాసాపేటలో వరిగ రోడ్డులో నివాసం ఉంటున్న పకీర్‌సాబ్ (68) అనే వ్యక్తి చెడు వ్యసనాలకు బానిసై అప్పుల బాధతో గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొంతకాలంగా మద్యం, జూదం తదితర చెడు వ్యసనాలకు అలవాటు పడ్డ పకీర్‌సాబ్ అక్కడక్కడా అప్పులు చేస్తూ వాటిని తిరిగి తీర్చలేక ఒత్తిడి ఎక్కువ కావడంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇతనికి భార్య, పిల్లలు ఉన్నారు. మృతుడి కుమారుడు మౌలానా ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాయచోటి ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ సీఐ చంద్రశేఖర్ తెలియజేశారు.

బాధితులకు న్యాయం చేస్తాం : ఆర్డీఓ



రోడ్డు పనులు పరిశీలిస్తున్న ఆర్డీఓ

బ్రహ్మంగారిమఠం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే బెంగళూరు-విజయవాడ పనుల కోసం భూములు కోల్పోయిన వారికి న్యాయం చేస్తామని బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్ తెలిపారు. గురువారం మల్లేపల్లె పరిసరాల్లో రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. భూములు కోల్పోయి నష్టపరిహారం రాని వారితో మాట్లాడారు. తహసీల్దారు దామోదర్‌రెడ్డి లబ్ధిదారుల వివరాలను ఆర్డీఓకు అందించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి మండల నాయకులు సాంబశివారెడ్డి, పూజా శివయ్య యాదవ్, శ్రీను, రమేష్, మేకల సుధాకర్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

డీఆర్పీలుగా ఉపాధి అవకాశాలు

● డీఆర్డీఏ పీడీ ఆనందనాయక్

కడప ఎన్టీఆర్ సర్కిల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీలో జిల్లా రీసోర్స్ పర్సన్స్(డీఆర్పీ)గా పనిచేసేందుకు ఉపాధి అవకాశాలు ఉన్నట్లు డీఆర్డీఏ పీడీ ఆనందనాయక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో పీఎం ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ (పీఎం ఎఫ్ఎంఈ)ని సమర్థవంతంగా అమలు చేసేందుకు మండల స్థాయిలో రీసోర్స్ పర్సన్‌లను ఎంపిక చేయ డం జరుగుతుంది. ఏదైన డిగ్రీ ఉత్తీర్ణత సాధించి కంప్యూటర్ ఇంటర్నెట్ ప్రావీణ్యం కలిగి ఉండాలని తెలిపారు. ప్రయాణాలు చేసేందుకు ఆసక్తి కలిగి ఉండి స్మార్ట్‌ఫోన్ వినియోగించే వారు అర్హులన్నారు. గత ఏడాది నవంబరు 1వ తేదీ నాటికి 21 నుంచి 30ఏళ్లు కలిగిన వారై ఉండాలన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ సహజ వనరుల అభివృద్ధి రం గంలో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 5లోపు మండలంలో ఉన్న వెలుగు కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సిందిగా సూచించారు. 8వ తేదీ రాజంపేట రోడ్డులోని టీటీడీసీలో రాత పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంపికైన వారికి రూ.20వేలు ప్రోత్సాహక ప్రతిపాదికన చెల్లించడం జరుగుతుందన్నారు. అర్హతలు, ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల 5లోపు ఆయా మండల సమాఖ్య-వెలుగు కార్యాలయాల్లో తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సిందిగా ప్రకటనలో కోరారు.

5న జిల్లా బాలుర హాకీ జట్ల ఎంపికలు

పులివెందుల టౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): వైఎస్ఆర్ కడప జిల్లా బాలుర జూనియర్, సబ్ జూనియర్ హాకీ జట్ల ఎంపికలు ఈ నెల 5న పులివెందులలోని వైఎస్ఆర్ ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ అకాడమీలో జరగనున్నట్లు హాకీ కడప జిల్లా సెక్రటరీ ఎం.శేఖర్ తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పులివెందులలో ఎంపికైన సబ్ జూనియర్ బాలుర జట్టు ఈ నెల 17వ తేదీ నుంచి 19 వరకు మదనపల్లెలో జరిగే 14వ రాష్ట్రస్థాయి బాలుర సబ్ జూనియర్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటుందన్నారు. ఈఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు ఖచ్చితంగా 1.1.2009 తరువాత జన్మించిన వారై ఉండాలన్నారు. అదే విధంగా జూనియర్ విభాగంలో ఎంపికైన బాలుర జట్టు ఈనెల రెండో వారంలో కాకినాడలో జరిగే ఏపీ రాష్ట్ర స్థాయి జూనియర్ బాలుర చాంపియన్ షిప్‌లో పాల్గొంటుంద న్నారు. ఇందులో పాల్గొనే క్రీడకారులు 1.1.2006వ తేదీ తరువాత జన్మించిన వారై ఉండాలన్నారు. ఈ ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు తమ వెంట ఆధార్‌కార్డు, బర్త్ సర్టిఫికెట్‌లను తీసుకుని ఈ నెల 5న ఉదయం 9గంటలకు పులివెందుల స్పోర్ట్స్ అకాడమీలో రిపోర్టు చేయాలని ఆయన తెలిపారు.

జువారిలో కేంద్ర మంత్రికి విందు

ఎర్రగుంట్ల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర శాస్త్ర సాంకేతిక, భౌగోళికశాస్త్ర శాఖ మంత్రి డాక్టర్ జితేంద్రసింగ్ గురువారం ఎర్రగుంట్లలోని జువారి కర్మాగారం అతిథి గృహానికి వచ్చారు. స్థానిక యాజమాన్యం, నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అక్కడ ఆయన మధ్యాహ్నం భోజనం చేసి విశ్రాంతి తీసుకు న్నారు. అనంతరం ఎమ్మెల్యే, కలెక్టర్ తదితరులతో కలిసి గండికోటకు వెళ్లారు. ఆయన వెంట ఎమ్మెల్యే ఆదినారా యణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి సి.భూపేష్‌రెడ్డి, బీజేపీ నాయకులు ఉన్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యత

వల్లూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ్య పుణ్యక్షేత్రమైన పుష్పగిరి క్షేత్రం అబివృద్ధితో ముందుకు తీసకెళ్తారని దేవాదాయ అసిస్టెంటు కమిషనరు మల్లిఖార్జున అన్నారు. గురువారం మండల పరిధిలోని క్షేత్రాన్ని ఆయన పరిశీలించారు. ముందుగా ఆలయం చుట్టుపక్కల ఉన్న చెత్త చెదారాన్ని మైదుకూరు, ప్రొద్దుటూరు నుంచి వచ్చిన భక్త సమూహంతో పరిశుభ్రం చేయించారు. అనంతరం వారందరికీ ధన్యవాదాలు తెలిపా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరశుభ్రతకే తాను మొదట ప్రాధాన్యత ఇస్తామన్నారు.

ఇంటర్నేషనల్ షూటింగ్ బాల్‌గేమ్స్‌కు హరిబాబు ఎంపిక



పోరుమామిళ్ల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ షూటింగ్ బాల్‌గేమ్స్‌కు రాయపాటి హరిబాబు అనే విద్యార్థి ఎంపికయ్యాడు. పోరుమామిళ్ల మండలం నాగులకుంట్లకు చెందిన హరిబాబు త్వరలో నేపాల్‌లో జరగబోయే ఇంటర్నేషనల్ గేమ్స్‌లో ఆడనున్నాడు. హరిబాబు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించి షూటింగ్ బాల్ ఇంటర్నేషనల్‌కు ఎంపికయ్యాడు. ప్రస్తుతం ఈ విద్యార్థి కడప ఐటీఐలో డీజిల్ మెకా నిక్‌గా చదువుతున్నాడు.

లా, బీఈడీ అడ్మిషన్లకు రిజిస్ట్రేషన్ గడువు పెంపు

అమరావతి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): లా, బీఈడీ కోర్సుల్లో అడ్మిషన్లకు రిజిస్ట్రేషన్ల గడువును ఈనెల 5 వరకు పొడిగించినట్లు ఉన్నత విద్యామండలి ఓ ప్రకటనలో తెలిపింది. యూనివర్సిటీల్లో స్పాట్ అడ్మిషన్లు, ప్రైవేటు లా, బీఈడీ కాలేజీల్లో కేటగిరీ బీ అడ్మిషన్లకు ఈ గడువు వర్తిస్తుందని తెలిపింది. అభ్యర్థుల వినతి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. ఇకపై ఎలాంటి పొడిగింపు ఉండదని స్పష్టం చేసింది.

మధ్యాహ్న భోజనంలో శనివారం మెనూ మార్పు

అమరావతి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకంలో శనివారం అందించే ఆహారం మెనూను సవరిస్తూ మధ్యాహ్న భోజనం పథకం డైరెక్టర్ బి.శ్రీనివాసరావు గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుత మెనూ ప్రకారం శనివారం రోజున విద్యార్థులకు ఆకు కూర అన్నం(పాలకూర, కొత్తిమీర, కరివేపాకు, పుదీనా), పప్పుచారు, స్వీట్ పొంగల్, రాగి జావ ఇస్తున్నారు. ఇక నుంచి ఆకు కూర అన్నం స్థానంలో సాధారణ అన్నం పెట్టి, స్థానికంగా అందుబాటులో ఉండే కూరగాయలతో కూర, స్వీట్ పొంగల్, రాగి జావ అందించాలని ఆదేశించారు.

నేడు జిల్లాస్థాయి సైన్స్‌ఫెయిర్

● 36మండలాల నుంచి రానున్న ప్రాజెక్టులు

● కడప ఉప విద్యాధికారి జి.రాజగోపాల్‌రెడ్డి



జిల్లా స్థాయి సైన్స్‌ఫెయిర్‌పై కమిటీ సభ్యులకు సూచనలు ఇస్తున్న కడప ఉప విద్యాధికారి రాజగోపాల్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కడప మున్సిపల్ హైస్కూల్ మెయిన్‌లో జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్‌ను శుక్రవారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఉప విద్యాశాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం జిల్లా సైన్స్ ఆఫీసర్ యబనైజర్ ఇమ్మానుయేల్, కడప మండల విద్యాశాఖాధికారి గంగిరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగమణి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమిటీలోని ఉపాధ్యాయులందరూ సమష్టి కృషితో సైన్స్ ఫెయిర్‌ను విజవయంతం చేయాలని సూచించారు. జిల్లాలోని 36 మండలాల నుంచి వ్యక్తిగత విభాగంలో 36, గ్రూపు విభాగంలో 36, ఉపాధ్యాయ విభాగంలో 36 చొప్పున సైన్స్ ప్రాజెక్టులు ప్రదర్శిస్తారని తెలిపారు. ఇందులో ఉత్తమ ప్రాజెక్టును ప్రతి విభా గంలో రెండు ఎంపిక చేస్తామన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, ఉపాధ్యాయుల పర్యవేక్షణ, విద్యార్థుల సందర్శన వంటి కార్యక్రమాలతో జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్‌ను విజయవంతం చేయాలని సూచించారు. కమిటీ సభ్యులు దశరథరామిరెడ్డి, కేశవరెడ్డి, నిత్యానందరెడ్డి, గంగాధర్, కృష్ణకిషోర్, విజయప్రసాద్, బాలకృష్ణ, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైవీయూకు ఎఫ్ఎస్ఎస్ఏఐ సర్టిఫికెట్



సర్టిఫికెట్లతో వీసీ కృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి, రిజిస్ట్రార్ పద్మ తదితరులు

కడప ఎడ్యుకేషన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): యోగివేమన యూనివర్సిటీ వసతి గృహాలలో నాణ్యమైన భోజనం, ఆహార పదార్థాలు విద్యార్థులకు ఇస్తున్నట్లు గుర్తించి ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) సర్టిఫికెట్ లభించింది. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ పుత్తా పద్మ సమక్షంలో వైవీయూ కళాశాల ప్రిన్సిపాల్, విశ్వవిద్యాలయ వసతి గృహాల చీఫ్ వార్డెన్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డికి ఆంధ్రప్రదేశ్ రూకో ప్రాజెక్టు హెడ్ అల్లూరి సంపత్ కుమార్ ఎఫ్ఎస్ఎస్ఏఐ సర్టిఫికెట్‌ను అందజేశారు. సంపత్‌కుమార్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయ వసతిగృహాల్లో లభించే ఆహార పదార్థాలను ఆకస్మికంగా పరిశీలన చేసినపుడు నిపుణులు నాణ్యతా ప్రమాణాలను గుర్తించారన్నారు. భవిష్యత్తులో ఈ సర్టిఫికెట్ ఇలానే కొనసాగించాలంటే అధికారులు, వార్డన్లు నిత్య పర్యవేక్షణ అవసరమన్నారు. వీసీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని పెన్నా, పాపాఘ్ని, చిత్రావతి, చెయ్యేరు మెస్‌లకు ఎఫ్ఎస్ఎస్ఏఐ సర్టిఫికెట్ రావడం సంతోషదాయకమన్నారు. అనంతరం రిజిస్ట్రార్ ఆచార్య పద్మ, ప్రిన్సిపల్ ఎస్.రఘునాథరెడ్డి మాట్లాడారు. సమావేశంలో ఐక్యూఏసీ డైరెక్టర్ సుబ్రమణ్యంశర్మ, సహాయ డైరెక్టర్ సుభాష్‌చంద్ర, పీఆర్ సెల్ సంచాలకులు డాక్టర్ పి. సరిత, వార్డన్లు తదితరులు పాల్గొన్నారు.

కువైత్‌లో వేంపల్లె వాసి మృతి



శివకుమార్ (ఫైల్)

వేంపల్లె, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె శ్రీరామ్‌నగర్‌కు చెందిన సగినాల శివకుమార్ (38) కువైత్‌లో బుధవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల వివ రాల మేరకు... వీరన్నగట్టుపల్లెకు చెందిన శివకుమార్ వేంపల్లె శ్రీరామ్‌నగర్‌లో భార్య పిల్లలతో కలసి నివాసం ఉండేవాడు. ఇక్క డ సరైన ఉపాధి దొరక్క ఎనిమిది సంవత్సరాల క్రితం కువైత్‌కు వెళ్లాడు. ఏడాదికో రెండేళ్లకు ఒకసారి ఇంటికొచ్చి వెళ్లేవాడు. ఇటీవల వచ్చిన శివకుమార్ రెండు నెలల క్రితం మళ్లీ కువైత్‌కు వెళ్లాడు. బుధవారం కువైత్‌లోని గదిలో పడుకొని ఉండగా గుండెపోటు రావడంతో మృతి చెందాడు. మధ్యాహ్నం తర్వాత అక్కడి సేఠ్ ఇతరులు గదిలోకి వెళ్లిచూడగా అప్పటికే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కువైత్‌లో ఉన్న బంధువుల సహకారంతో మృతదేహాన్ని వేంపల్లెకు తెప్పించేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి పేదకుటుంబాన్ని ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

వివాహిత ఆత్మహత్య



ఎర్రగుంట్ల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మలపల్లికి చెందిన వనంనేత్ర (18) బుధవారం రాత్రి ఇంట్లో ఉరివేసుకుంది. డబ్బుల విషయంలో భర్త నాగరాజు మందలించడంతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లుగా తెలిసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కడప క్రైం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కడప నగరం అక్కాయపల్లె వద్ద టీవీఎస్ వాహనంలో ఓ వ్యక్తి వెళుతూ కింద పడి తీవ్రగాయాలయ్యాయి. రిమ్స్‌లో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు తాలుకా పోలీసులు తెలిపారు. అక్కాయపల్లె చెందిన హర్షద్ అలీ (58) ఆర్టీసీలో పనిచేస్తున్నాడు. బుధవారం రాత్రి టీవీఎస్ వాహనంలో ఇంటికి వెళుతుండగా స్కూటరుపై నుంచి కింద పడటంతో గాయపడ్డాడు. స్థానికులు రిమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

డబ్బు కోసం మా నాన్నను మనవడే చంపాడు

● నెల తరువాత కొడుకు ఫిర్యాదు

● విచారణ చేపడుతున్న పోలీసులు

మైదుకూరు రూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మా నాన్న పొలం అమ్మిన డబ్బులు ఇవ్వాలని వేధించి.. ఆయన మనవడు చంపేశాడని కుమ్మరి రమేష్ గురువారం మైదుకూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని శెట్టివారిపల్లెకు చెందిన వీరారెడ్డికి మొదటి భార్య కుమారుడు రాఘువరెడ్డితో పాటు ముగ్గురు అక్క చెల్లెళ్లు, రెండో భార్యకు రమేష్ ఏకైక సంతానం. గతంలో అందరూ శెట్టివారిపల్లెలోనే నివాసం ఉండేవారు. తరువాత వీరారెడ్డి మొదటి భార్య, రెండో భార్యకు సఖ్యత లేకపోవడంతో రెండో భార్య సుబ్బమ్మ, అమె కుమారుడు రమేష్ ప్రొద్దుటూరు మండలం గోప వరం సమీపంలోని యానాది కాలనీలో నివశించేవారు. వీరారెడ్డి వస్తూ పోతుండేవాడు. ఈ నేపథ్యంలో మొదటి భార్య కుమారుడు రాఘువరెడ్డికి కరెంటుషాక్ తగిలి మృతి చెందాడు. ఆ తరువాత కొంత కాలానికి వీరారెడ్డి మొదటి భార్య, రెండో భార్య అనా రోగ్యంతో మరణించారు. వీరారెడ్డికి పక్షవాతం రావడంతో ఆయనకు నేనే దగ్గరుండి వైద్యం చేయించి బాగు చేశానని రమేష్ తెలిపారు. తొమ్మిది నెలల క్రితం వీరారెడ్డి పేరు మీద ఉన్న ఎకరం పొలం అమ్మగా ఏడు లక్షల రూపాయల వచ్చిందని, ఆ డబ్బులు ఇవ్వాలని మొదటి భార్య మనవడు హరినాథ్‌రెడ్డి తరచూ వేధిస్తున్నట్లు చెప్పేవాడని రమేష్ ఫిర్యాదులో పేర్కొ న్నారు. గత నెల 6వ తేదీ మా నాన్న చనిపోయాడని తెలిసి అంత్యక్రియలు చేసి తిరిగి మా గ్రామానికి వచ్చేశామని తెలి పారు. అయితే హరినాథ్‌రెడ్డి మా నాన్న వీరారెడ్డిని ముక్కు నోరు మూసి చంపివేశాడని గ్రామస్తుల ద్వారా సమాచారం తెలియడంతో గురువారం మైదుకూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ ఆదేశాల మేరకు సీఐ హసం, ఎస్ఐఐ చిరంజీవి విచారణ చేపట్టారు.

రేపు వామికొండ జలాశయంలో చేపల వేటకు వేలం

ముద్దనూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఉప్పలూరు గ్రామ సమీపంలోనున్న వామికొండ జలాశయంలో చేపల వేటకు సంబంధించి శనివారం వేలం నిర్వహిస్తున్నట్లు మైలవరం మత్స్య అభివృద్ధి అధికారి కిరణ్‌కుమార్ తెలిపారు. కొలవలి గ్రామ సచివాలయం వద్ద ఉదయం 10-30గంటలకు వేలం ప్రారంభమవుతుందని, పాటలో డిపాజిట్ చెల్లించి పాల్గొనవచ్చని తెలిపారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ఘనంగా ఆరాధన ఉత్సవాలు

రామాపురం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన రామాపురంలో వెలసిన కేవలానంద లక్ష్మనార్యస్వామి ఆరాధన ఉత్సవాలు గురువారం ఘనంగా ముగిశాయి. జిల్లా పరిధిలో శ్రీకేవలానంద స్వామి ఓ ప్రఖ్యాత గురువు. ఈ ఆరాధన ఉత్సవాలు మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా జరిగాయి. 65వ ఆరాధన ఉత్సవాలకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. భక్తులకు ఉచిత అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

ధనుర్మాసంలో నగర సంకీర్తన

రైల్వేకోడూరు(రూరల్), జనవరి 2(ఆంధ్రజ్యోతి): ధనుర్మాసం సందర్భంగా నగర సంకీర్తన కార్యక్రమం గురువారం నిర్వహించారు. బలిజ వీధిలోని కోదండరామస్వామి ఆలయం, కన్యకా పరమేశ్వరి ఆలయంలో వెలసి ఉన్న కోదండరాముడి నిర్వాహకులు, భక్తులు నగర సంకీర్తన చేశారు. భక్త బృందం గురువారం పట్టణంలోని బలిజ వీధి, పాత బజారు, మార్కెట్ వీధిలో సంకీర్తనలు నిర్వహించారు. కార్యక్రమంలో కన్యకా పరమేశ్వరి ఆలయం కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

'వలంటీర్ల హామీలు నెరవేర్చాలి'

నందలూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఎన్డీయే కూటమి ఎన్నికలకు ముందు వలంటీర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని నాగిరెడ్డిపల్లె గ్రామ పంచాయతీ వలంటీర్లు డిమాండ్ చేశారు. గురువారం ఆ గ్రామ పంచాయతీ క్లర్కు నరసింహులుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ వలంటీర్లు సాయిక్రిష్ణ, అజయ్, శ్రీకాంత్, కమాల్‌బాషా, సుబ్రమణ్యంరెడ్డి, సుధీర్‌కుమార్, మహిళా వలంటీర్లు సుబ్బలక్షుమ్మ, మాణిక్యమ్మ, పావని, స్వప్న, రేవతి, జ్యోతి, అమ్ములు, యల్లమ్మ పాల్గొన్నారు.

గోపగుడిలో 'పొలం పిలుస్తోంది'

రామాపురం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): గోపగుడిపల్లె గ్రామ పంచాయతీలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి నాగమణి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి లక్కిరెడ్డిపల్లె డివిజన్ సహాయక వ్యవసాయ సంచాలకురాలు జయరాణి హాజరై మాట్లాడుతూ పొలం పిలుస్తోందిలో భాగంగా రబీ సీజన్‌లో సాగు చేసిన పంటల వివరాలు రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నాగమణి, రైతు సేవా కేంద్రం సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

చిన్నారులకు పుస్తకాల పంపిణీ

● ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీవిద్య

సిద్దవటం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాధవరం-1 పంచాయతీ బంగారుపేట అంగన్వాడీ కేంద్రంలో భాకరాపేట సెక్టార్ అంగన్వాడీ కార్యకర్తలకు గురువారం ప్రీ స్కూల్ విద్యార్థులకు అందించే పీపీ-1, పీపీ-2 పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీవిద్య మాట్లాడారు. ప్రీస్కూల్ పిల్లల నమోదుకు పిల్లల తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ఉరుసు మహోత్సవం

సిద్దవటం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాచుపల్లె గ్రామ సమీపంలో వెలసిన హజరత్ సయ్యద్‌షావలి ఉరుసు మహోత్సవాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు దర్గా కమిటీ సభ్యులు, మాచుపల్లె గ్రామ పెద్దలు గురువారం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి సయ్యద్ సలావుద్దీన్ మాట్లాడుతూ శుక్రవారం రాత్రి 9 గంటలకు గంధం, చాందిని, మేళతాళాలతో, బ్యాండ్ వాయిద్యాలతో గ్రామంలో ఊరేగింపు జరుగుతుందన్నారు.

యూటీఎఫ్ కరపత్రాల ఆవిష్కరణ

రాయచోటిటౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ స్వర్ణోత్సవ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని కోరుతూ గురువారం రాయచోటిలోని అలీమాబాద్ ఉర్దూ ఉన్నత పాఠశాల ఆవరణంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జాబీర్ ఆహ్వాన పత్రికలు, కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాయచోటి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హఫీజ్, రాజారమేశ్, సహాధ్యక్షులు రెడ్డిబసయ్య, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేయండి

గాలివీడు,జనవరి2(ఆంధ్రజ్యోతి):ఎస్ఎంసీ సభ్యులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కలిసికట్టుగా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలని ఎంఈవోలు నాగరాజ్, శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులకు, ప్రధానోపాధ్యాయులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సీఆర్పీలు శ్రీనివాసులు, దుర్గేశ్వరరాజు, వెంకట్రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే గ్రామసభలు

● ఆర్డీవో శ్రీనివాసులు



వినతులు స్వీకరిస్తున్న ఆర్డీవో శ్రీనివాసులు

లక్కిరెడ్డిపల్లె, జనవరి 2(ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం గ్రామ సభలు ఏర్పాటు చేసిందని ఆర్డీవో శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం మండలంలోని అనంతపురం ఈడిగపల్లెలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఫ్రీహోల్డ్, రీసర్వే, గతంలో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలు గ్రామసభల ద్వారా పరిష్కారం చేసుకోవచ్చన్నారు. మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో భూ సమస్యలు ఉన్నాయని తమ దృష్టికి వచ్చాయని, వీటన్నిటిని త్వరగా పరిష్కరిస్తామన్నారు. ఎక్కువగా గ్రామ కంఠం, భూఆక్రమాలు, ప్రభుత్వ భూములపై ప్రత్యేక దృష్టి పెట్టాలని రెవెన్యూ సిబ్బందికి సూచించారు. అనంతపురం ఈడిగపల్లెలో రీ సర్వేలో పొరపాట్లు వచ్చాయని, వీటిని త్వరలో పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం గంగమ్మజాతరలోని గంగమ్మతల్లిని దర్శించుకొని ఫిబ్రవరి 28న జరగబోవు గంగమ్మజాతరకు సంబంధించిన వివరాలు ఈవో శ్రీనివాసులును అడిగి తెలుసుకున్నారు. జాతరకు సంబంధించి త్వరలో శాఖల వారీగా సమావేశం ఏర్పాటు చేసి జాతర ప్రశాంతంగా జరిగేలా అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల యువనాయకుడు, ఎంపీటీసీ మాజీ అధ్యక్షుడు యనమల మదన్‌మోహన్, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో రెడ్డెయ్య, మండల సర్వేయర్, మదన్‌మోహన్‌రెడ్డి, గ్రామ సర్వేయర్లు, ఎంఆర్ఐ రాజేష్, గ్రామ నాయకులు చలపతి, ప్రతాప్‌రెడ్డి, తుమ్మల హరి, శంకర, వేణు తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ దేవతకు చలువ పూజలు



అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న గ్రామస్తులు

రాజంపేట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో అగ్రహారం గంగమ్మతల్లికి గురువారం చలువ పూజలు నిర్వహించారు. సంవత్సర ఆరంభ సందర్భంగా ఏడాది పొడవునా అందరూ ఆరోగ్యంగా ఉండాలని, పంటలు బాగా పండాలని కోరుతూ చల్లని దీవెనలను అందివ్వాలని ఆ గ్రామ ప్రజలు అమ్మవారికి చలువ పూజలు నిర్వహించారు. రాగులు, సజ్జలు, వరి బియ్యం తదితర ధాన్యాలతో తయారు చేసిన చలువను అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా పూజారులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమంలో కె.ప్రభాకర్‌రాజు, చల్లా సుధాకర్‌బాబు, ఎ.చంద్రశేఖర్‌రాజు, ఎ.శ్రీనివాసులురాజులు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం

సిద్దవటం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన సిద్దవటం జడ్పీ హైస్కూల్లో గురువారం పాఠశాల యాజమాన్యం, చైర్మన్, ప్రధానోపాధ్యాయులకు ఒక్కరోజు ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి కో డైరెక్టర్‌గా ఎంఈవో విలియంరాజు వ్యవహరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు శ్రీరాములు మాట్లాడుతూ పాఠశాల యాజమాన్యం కమిటీ చైర్మన్, ప్రధానోపాధ్యాయులు పాఠశాల అభివృద్ధికి పాటుపడాలన్నారు. ఏ పథకమైనా విజయవంతంగా అమలు జరిగి అనుకున్న ఫలితాలు సాధించాలంటే ప్రజల భాగస్వామ్యం చాలా అవసరమన్నారు. ఎంఈవో మాట్లాడుతూ విద్యాహక్కు 2009 చట్టం ప్రకారం ప్రతి ప్రభుత్వ పాఠశాలలో నెలకొకసారి పాఠశాల యాజమాన్య కమిటీ సమావేశాలు తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 అరుణ, సీవో సురేష్‌బాబు, విద్యాకమిటీ చైర్మన్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్ఎంసీ కమిటీ సభ్యులకు శిక్షణ

చిట్వేలి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని ప్రాథమిక ఉన్నత పాఠశాలల ఎస్ఎంసీ కమిటీలకు గురువారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంఈవోలు కోదండనాయుడు, ఈశ్వరయ్యల అధ్యక్షతన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆర్పీలు చెన్నకేశవరెడ్డి, శ్రీహరి, నారాయణరెడ్డిలు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న పాఠశాల యాజమాన్య కమిటీ శిక్షణ కార్యక్రమం పాఠశాలల సమగ్ర అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. పిల్లల హాజరు, మధ్యాహ్న భోజన పథకం, పాఠశాల అభివృద్ధి వంటి అంశాల్లో ఉపాధ్యాయులకు సహకరిస్తూ తమవంతు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎస్ఎంసీ సభ్యులు, సీఆర్పీ చంద్ర పాల్గొన్నారు.

కార్మికుల ధర్నాను జయప్రదం చేయండి

రాయచోటిటౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): జీవో-36ను ఇంజనీరింగ్ కార్మికులకు అమలు చేయాలని కోరుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం జిల్లాలోని అన్ని మున్సిపల్ కార్యాలయాల ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగే ధర్నా కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బీవీ రమణ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట విలేకరులతో మాట్లాడుతూ మున్సిపాలిటీల్లో వాటర్ సెక్షన్, ఫిట్టర్, ఎలక్ట్రీషియన్లకు గత 7 ఏళ్ల నుంచి వేతనాలు పెంచలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కోశాధికారి రాంబాబు, ఉపాధ్యక్షులు చెన్నయ్య, శంకరయ్య, ఇంజనీరింగ్ కార్మికులు దేవా, మల్లికార్జున, ఖాదర్‌వలి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మౌలిక వసతులతో పర్యావరణ రక్షణ

రామాపురం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల అభివృద్ధికి మౌలిక సదుపాయాల కల్పనతో పర్యావరణాన్ని కాపాడుకోవాలని ఎంఈవోలు రామకృష్ణుడు, జయచంద్రలు తెలిపారు. మండలంలోని ఆదర్శ పాఠశాలలో జరుగుతున్న ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు సంబంధించిన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయనీలకు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా బిట్స్ ఇంజనీరింగ్, ఫార్మసీ విద్యాసంస్థల చైర్మన్ భాస్కర్ పాల్గొన్నారు. ఆయన 2025 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్యామలాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మండల స్థాయి శిక్షణా కార్యక్రమం

మండల పరిధిలోని ఏపీ మోడల్ స్కూల్‌లో గురువారం మండల స్థాయి పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులకు, ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఎంఈవోలు రామకృష్ణుడు, జయచంద్రలు తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమానికి రీసోర్స్ పర్సన్ విశ్వనాధ్, కుమార్, బీసీ వెంకటసుబ్బయ్య, ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దు రాళ్లను నాటించండి

పెనగలూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పెనగలూరు కన్యకలచెరువును సర్వే చేయించి చెరువు ఎంత విస్తీర్ణం ఎంత ఉందో సరిహద్దు రాళ్లను నాటించాలని సాగునీటి సంఘం అధ్యక్షుడు అక్కినేని రామసుబ్బానాయుడు, పెనగలూరు రెవెన్యూ సిబ్బందిని కోరారు. గురువారం పెనగలూరు సచివాలయంలో తహసీల్దారు సీహెచ్ ఇంద్రాణి అధ్యక్షతన రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన తహసీల్దారుకు అర్జీ ఇస్తూ పెనగలూరు చెరువుకు ఉత్తర, దక్షిణ పశ్చిమ భాగాల్లో భారీగా ఆక్రమణలకు గురైందని తెలిపారు. పెనగలూరు, సిద్దవరం, పద్మగారిపల్లె, కేసీ పల్లె గ్రామాలకు చెందిన కొంతమంది కబ్జాదారులు చెరువులు కబ్జా చేసి భూములను సాగు చేసుకుంటున్నారని ఈ సందర్భంగా తెలిపారు.

ప్రకృతి వ్యవసాయం ఎంతో మేలు : ఏవో



రైతులతో మాట్లాడుతున్న ఏవో మల్లిక

ఓబులవారిపల్లె, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం ఎంతో మేలు అని ఏవో మల్లిక తెలిపారు. మండలంలోని నూకనపల్లె గ్రామంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా అరటిసాగు రైతు భరత్‌కుమార్‌రెడ్డి పొలంలో పరిశీలించి రైతు అనుసరిస్తున్న సాగు విధానాలను అడిగి తెలుసుకుని అందుకు సంబంధించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మామిడి, అరటి, బొప్పాయి, పుచ్చకాయ, దోస వంటి పంటలు సాగుకు సంబంధించి మెళకువలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంసీఏ బుల్లయ్య, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, పశువైద్య సిబ్బంది, రైతులు భరత్‌కుమార్‌రెడ్డి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఎస్టీయూ ద్వారా అత్యుత్తమ సేవలు

నందలూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): అత్యుత్తమ సేవల ద్వారా ఉపాధ్యాయుల అభిమానాన్ని పొందిన సంఘంగా రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) ఉందని జడ్పీ ఉన్నత పాఠశాల పాటూరు ప్రధానోపాధ్యాయురాలు మాధవిలత పేర్కొన్నారు. రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రూపొందించిన డైరీ, క్యాలెండర్లను గురువారం ఆమె ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ మండలశాఖ అధ్యక్షుడు షఫివుల్లా, శివశంకర్‌రెడ్డి, శారద, పవనకుమారి, సుస్మిత, లక్ష్మీనారాయణరెడ్డి, కిరణ్‌బాబు, జగన్, ప్రసాద్, శ్రీధర్, లక్ష్మీకాంతమ్మ, శైలజ, అమర్‌నాద్, చిన్నబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

పుల్లంపేట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక పుల్లంపేట మెయిన్ పాఠశాలలో ఎంఈవోలు చక్రధర్‌రాజు, నాగతిరుమలరావులు గురువారం పీఆర్టీయూ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఉపాధ్యాయులకు సకాలంలో రావాల్సిన ప్రయోజనాల కోసం పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం పోరాటాలు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వర్, అధ్యక్షులు సుబ్బారావు, మునయ్య, శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు- రిమ్స్‌కు తరలింపు

సిద్దవటం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కడప- చెన్నై జాతీయ రహదారి భాకరాపేట డాబా సమీపాన గురువారం రాత్రి రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈయన మోదిన్‌సాహెబ్‌పల్లె గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ(45)గా గుర్తించారు. ద్విచక్ర వాహనంలో కడప నుంచి వస్తుండగా అదుపు తప్పి కిందపడడంతో బలమైన గాయాలయ్యాయి. స్థానికులు ఘటన స్థలానికి చేరుకుని 108లో కడప సర్వజన ఆసుపత్రికి తరలించారు.

5న రంగనాథస్వామి కల్యాణోత్సవం

రాజంపేటటౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తోట కల్యాణ మండపంలో ఈ నెల 5న ఆదివారం ఉదయం 9 గంటలకు జరిగే ప్రసన్న రంగనాథస్వామి, గోదాదేవి, మహాలక్ష్మీదేవి సమేత కల్యాణోత్సవానికి సంబంధించిన కరపత్రాలను గురువారం సాయంత్రం తిరుప్పావై భక్తసేవాసమితి సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్యనిర్వాహక సభ్యురాలు సరిత మాట్లాడుతూ నూతన సంవత్సరం సందర్భంగా ఈ ఏడాది ప్రజలకు అన్నిరకాల మంచి జరగాలన్న ఉద్దేశ్యంతో గత మూడేళ్లుగా నిర్వహిస్తున్న కల్యాణోత్సవంలో భాగంగా ఈ ఏడాది కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కల్యాణోత్సవానికి సంబంధించి ఐదో తేదీ ఉదయం 9 గంటల నుంచి గోదాదేవి, మహాలక్ష్మీదేవి, ప్రసన్నరంగనాథస్వామి కల్యాణోత్సవాన్ని ఎంతో వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రముఖ ఆధ్యాత్మిక గాయకులు, గిన్నీస్ రికార్డు గ్రహీత వెంకటేశ్వర్లు, కోటపాటి గోవిందదాస్ ఆధ్వర్యంలో అన్నమాచార్య సంకీర్తన కార్యక్రమం ఉంటుందన్నారు. మధ్యాహ్నం అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు ఈ కల్యాణోత్సవానికి హాజరై దేవదేవుని కృపాకటాక్షాలకు పాత్రులు కావాలని విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ బడుల బలోపేతమే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో వెంకటేశ్‌నాయక్

సుండుపల్లె, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడుల బలోపేతమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంఈవోలు వెంకటేశ్‌నాయక్, రవీంద్రనాయక్‌లు తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, స్కూల్ కమిటీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, ప్రతి పాఠశాల నుంచి విద్యార్థుల తల్లిదండ్రులు ఒకరు కార్యక్రమానికి హాజరయ్యారు. ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని సూచించారు. అలాగే నాణ్యమైన భోజనం అందించాలని, పాఠశాల చైర్మన్లు లేదా విద్యార్థుల తల్లిదండ్రులు మధ్యాహ్నం భోజనాన్ని తనిఖీ చేయాలని తెలిపారు. ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు దుర్వినియోగం కాకుండా మౌలిక వస్తువుల కల్పనకు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, స్కూల్ కమిటీ చైర్మన్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

4, 5 తేదీల్లో జాతీయస్థాయి గ్లోబల్ బిజినెస్ మీట్

రాజంపేట/నందలూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): అమెరికాలోని ప్రముఖ ఆప్తా క్యాటలిస్టు సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 4, 5 తేదీల్లో హైదరాబాదు హైటెక్ సిటీలోని హైటెక్ హాల్ నంబరు 4లో బలిజ, కాపు కులాలకు సంబంధించి జాతీయస్థాయి గ్లోబల్ బిజినెస్ మీట్ నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ ఉమ్మడి కడపజిల్లా బలిజ, కాపు వెల్ఫేర్ కోఆర్డినేటర్ చలమాల మురళీకృష్ణలు తెలిపారు. ఈ మేరకు ఏపీటీఏ అధ్యక్షుడు ముద్రగడ త్రినాధ్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ ఎంతో వ్యయంతో మొట్టమొదటిసారిగా నిర్వహిస్తున్న ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ముఖ్యమంత్రులు చంద్రబాబునాయుడు, రేవంత్‌రెడ్డితో పాటు పద్మవిభూషన్ మెగాస్టార్ చిరంజీవి, ప్రపంచవ్యాప్తంగా ఐటీ రంగంలో ఉన్న పలు రంగాలకు చెందిన 3 వేల మంది బలిజ, కాపులు వస్తున్నారన్నారు.

ఆలయానికి స్థలం కేటాయించాలి



రెవెన్యూ సిబ్బందికి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

నందలూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిరెడ్డిపల్లె గ్రామంలో వెలసిన మారమ్మ తల్లి ఆలయం ఎదురుగా ఉన్న గ్రామకంఠంలోని 8 సెంట్లు స్థలాన్ని ఆలయానికి కేటాయించాలని ఆలయ కమిటీవారు రెవెన్యూ సదస్సులో విన్నవించారు. గురువారం నాగిరెడ్డిపల్లె 3వ సచివాలయంలో రెవెన్యూ గ్రామ సభ నిర్వహించారు. అదేవిధంగా మూసివేసిన ఆల్విన్ కర్మాగారంలో ఏదోక పరిశ్రమ ఏర్పాటు చేసేందుకు చొరవ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ ముజీబ్‌బాషా, డిప్యూటీ తహసీల్దారు శ్రీనివాసులు, బీజేపీ నాయకులు పోతురాజు మస్తానయ్య, నీటి సంఘం అధ్యక్షుడు ఉమామహేశ్వర్, టీడీపీ నాయకులు, రెవెన్యూ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం ఢీకొని మహిళకు తీవ్రగాయాలు



సిద్దవటం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం ఢీకొని మూలపల్లె క్రాస్ వద్ద బుధవారం రాత్రి మహిళకు బలమైన గాయమైంది. ఏఎస్ఐ రామచంద్ర వివరాల మేరకు... మండలంలోని సిద్దవటం, భాకరాపేట, ప్రధాన రహదారి పక్కన ఓ టీ దుకాణంలో పనిచేసే మూలపల్లె గ్రామానికి చెందిన పడిగెల రాణి (40) టీస్టాల్‌లో పనిముగించుకుని స్వగ్రామానికి వెళుతుండగా మూలపల్లె క్రాస్ రహదారి వద్ద బుధవారం రాత్రి రిమ్స్ దంత వైద్యశాలలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న మేకల వెంకటసుబ్బయ్య ద్విచక్ర వాహనంలో వెళుతూ ఆమెను ఢీకొనడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం సిద్దవటం వైద్యశాలకు 108 వాహనంలో తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం వైద్యులు కడప సర్వజన ఆసుపత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు.

బాధితులకు సీఎంఆర్ఎఫ్ అందజేత



సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

ఓబులవారిపల్లె, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వై.కోట గ్రామానికి చెందిన షేక్ నూరమ్మగారి తాజన్‌కు చికిత్స జరగకముందే రూ.2.50 లక్షల సీఎం సహాయ నిధి నుంచి మంజూరు చేయించి చెక్కును బాధితుల నివాసం వద్దకు వెళ్లి పంపిణీ చేసినట్లు ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే అరవ శ్రీధర్ తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తీవ్ర అనారోగ్యానికి గురైన పేదలకు సత్వర సహాయం అందించడం కోసం నిర్విరామ కృషి చేస్తున్నామని సీఎం సహాయనిధి ద్వారా నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో పేదలకు ఆర్థిక సహాయం అందజేయడం కోసం సమర్థవంతమైన ప్రత్యేక వ్యవస్థను ఏర్పరిచామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రజలను భాగస్వామ్యం చేయాలి



పాఠశాల యాజమాన్య కమిటీకి సూచనలు చేస్తున్న డీఈవో

రాజంపేటటౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పాఠశాల అభివృద్ధిలో ప్రజలను భాగస్వామ్యం అయ్యేలా పాఠశాల యాజమాన్య కమిటీ చొరవ చూపాలని డీఈవో కె.సుబ్రమణ్యం పేర్కొన్నారు. పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో గురువారం పాఠశాల యాజమాన్య కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో విద్యాకమిటీ చైర్మన్లు, ప్రధానోపాధ్యాయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులు సమయపాలన పాటించకపోయినా వారిని ఇంటివద్ద చక్కగా చదివించే బాధ్యత విద్యాకమిటీ తీసుకోవాలని సూచించారు. జిల్లా ఉప విద్యాశాఖాధికారి శివప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ పాఠశాలలో నాణ్యమైన విద్య, అందుకు తగ్గ తరగతి గదుల గురించి పాఠశాల విద్యాకమిటీ ప్రజలకు తెలియజెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రఘునాధ్‌రాజు, ఎంఆర్పీ జిలాన్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎండీసీకి నష్టం వస్తే ఊరుకోం

● సమ్మె నోటీసు అందజేసిన కార్మిక సంఘాల నాయకులు



సీపీవోకు నోటీసులు అందజేస్తున్న దృశ్యం

ఓబులవారిపల్లె, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఏపీఎండీసీ సంస్థ అభివృద్ధికి నష్టం వాటిల్లేలా చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదని కార్మిక సంఘాలతో కలిసి సీపీవోకు సమ్మె నోటీసును అందజేశారు. ఏపీఎండీసీ మంగంపేట సంస్థకు నష్టం కలిగేలా సీ అండ్ డీ, డబ్ల్యూ గ్రేడ్ ముగ్గురాయి బల్క్ టెండరును రద్దు చేయాలని, లేదంటే జనవరి 16 నుంచి సమ్మె చేస్తామని సీపీవో ద్వారా కార్మిక సంఘాల నాయకులు ఏపీఎండీసీ ఎండీకి నోటీసులు అందజేశారు. ఈ మేరకు అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ ప్రాంగణంలో గురువారం సమావేశమయ్యారు. కార్మిక నాయకులు మాట్లాడుతూ 1975 నుంచి ఏపీఎండీసీ ఆధ్వర్యంలో పలు ప్రైవేటు కంపెనీలు ఖనిజాన్ని వెలికి తీస్తున్నాయని, మంగంపేటలో ఏపీఎండీసీగా ఉన్న సంస్థను, గ్రామాలను కలుపుకుని అభివృద్ధి చేస్తామంటూ చెప్పి ఇప్పటికీ మోసం చేస్తూనే ఉన్నారని, 90 శాతం పర్మినెంట్ ఉద్యోగాలు నేటికీ ఖాళీగానే ఉన్నాయని ఆరోపించారు. ప్రస్తుతం ఏపీఎండీసీ స్టాక్‌పాయింట్‌లో సీడీ, డబ్ల్యూ గ్రేడ్ ముగ్గురాయి 83 లక్షల టన్నులు, మైనింగ్‌లో 60 లక్షల టన్నులు ఉందన్నారు. జాయింట్ వెంచర్‌గా ఉన్న ఐబీసీ ఏబీసీపీఎల్‌ని గాలికొదిలేశారని విమర్శించారు. ఈ నెల 15 లోపు డిమాండ్‌లు తీర్చకపోతే 16 నుంచి నిరవధిక సమ్మెకు వెళతామని ఏపీఎండీసీ ఎంప్లాయీస్ యూనియన్, ఏపీఎండీసీ వర్కర్స్ యూనియన్, ఏపీఎండీసీ ట్రైసీ, కార్మిక పోరాట సంఘాల నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

అబలలకు 'ఉల్లాస్'



- నిరక్షరాస్యులైన మహిళలకు రాత్రి బడులు
- ఆర్థిక, సామాజిక, డిజిటల్ విధానంపై బోధన
- జిల్లాలో 23,470 మంది ఎంపిక

కడప ఎడ్యుకేషన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోంది. నిరక్షరాస్యులైన మహిళల్లో అక్షర వెలుగులు నింపేందుకు చర్యలు చేపట్టింది. ప్రస్తుత రోజుల్లో పల్లె, పట్టణం తేడా లేకుండా ఎక్కడ చూసిన డిజిటల్, సాంకేతికత, నగదు రహిత లావాదేవీలు కొనసాగుతున్నాయి. పొదుపు సంఘాల్లో మహిళలకు ఇవన్నీ నేర్చుకోవడం ఎంతో అవసరం. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఉల్లాస్ (అండర్‌స్టాండింగ్ ఆఫ్ లైఫ్‌లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) అనే కార్యక్రమం తీసుకొస్తోంది. ఇందులో భాగంగా ఆర్థిక సామాజిక డిజిటల్ అక్షరాస్యతపై మహిళలకు తరగతులు నిర్వహిస్తోంది. బ్యాంకు ఖాతాలున్న వారికి వాటి నిర్వహణపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ ఉద్దేశం. జిల్లాలో డ్వాక్రా మహిళలతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో ఆయాలు, వంట పని చేసే వారికి ఈ పథకం అమలు చేయనున్నారు.

ఉల్లాస్ కార్యక్రమాన్ని న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రాం (ఎన్ఐఎల్‌పీ) అని కూడా అంటారు. ఇది జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) 2020కి అనుగుణంగా ఉండే కేంద్ర ప్రాయోజిత కార్యక్రమం. 15 ఏళ్లు అంతకంటే ఎక్కువ వయసు ఉన్న పెద్దలకు సాధికారత కల్పించడం, పాఠశాల విద్య అందించడం దీని లక్ష్యం. చదవడం, రాయడం, సంఖ్యా నైపుణ్యాలతో సహా క్రియాత్మక అక్షరాస్యతను అందించడంపై దృష్టి పెడుతుంది. జీవితకాల అభ్యాసాన్ని పెంపొందించడం ద్వారా అభ్యాసకులను క్లిష్టమైన జీవిత నైపుణ్యాలతో సుసంపన్నం చేస్తుంది. ముఖ్యంగా ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత, లీగల్ అక్షరాస్యత, క్రియాత్మక అక్షరాస్యత గురించి విద్యను 15 ఏళ్లు అంతకంటే ఎక్కువ వయసు ఉన్న పెద్దలకు అందిస్తారు. రాష్ట్రంలోని మొత్తం 26 జిల్లాల్లో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అమలు చేయనున్నారు. ఎస్‌హెచ్‌సీ లబ్ధిదారులు అన్ని ప్రభుత్వ ఎంపీపీఎస్, జడ్పీహెచ్ఎస్, ఎయిడెడ్ పాఠశాలల్లోని ఆయాలు, వంటవారు, సహాయకులు, నైట్ వాచ్‌మెన్లు, అంగన్వాడీ హెల్పర్లు ఈ ప్రోగ్రాంలో అభ్యాసకులు. మన రాష్ట్రంలో ఈ ప్రోగ్రాం కాలవ్యవధి మూడు సంవత్సరాలు. ఈ కార్యక్రమానికి చైర్మన్‌గా కలెక్టర్ వ్యవహరిస్తారు. వయోజన విద్య ఉప సంచాలకులు, మెంబర్, కన్వీనర్, సభ్యులుగా ప్రాజెక్టు డైరెక్టర్, డీఆర్‌డీఏ, ఐసీడీఎస్ పీడీ, జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ), జిల్లా విద్యాధికారి (డీఈఓ), జిల్లా ప్రజా సంబంధాల అధికారి (డీపీఆర్ఓ), జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల నోడల్ అధికారి ఉంటారు. పది మంది అభ్యాసకులకు ఒక వలంటరీ టీచర్ ద్వారా చదువు నేర్పిస్తారు. విద్యావంతులైన విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లు (వీఓఏ)లు క్లస్టర్ ఎస్‌హెచ్‌జీల రీసోర్స్ పర్సన్లు వలంటీర్ టీచర్లుగా వ్యవహరిస్తారు. ప్రతి వలంటీర్ టీచర్ పది మంది అభ్యాసకులతో మ్యాపింగ్ చేస్తారు. ఈ కార్యక్రమం అంగన్వాడీ కేంద్రంలో సాయంత్రం రెండు గంటలు నిర్వహిస్తారు. మొత్తం ఆరు నెలలకు గాను వంద రోజులు ఈ కార్యక్రమం ఉంటుంది. గ్రామస్థాయిలో కార్యక్రమం సమన్వయాన్ని విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్ (వీఓఏ) పర్యవేక్షిస్తారు. క్లస్టర్ కోఆర్డినేటర్ (సీసీ), ఎస్ఈఆర్‌పీ, వీఓఏ, సీసీ కార్యక్రమం సమన్వయ ప్రయత్నాలకు నాయకత్వం వహిస్తారు. మండల స్థాయిలో ఈ కార్యక్రమాన్ని ఎంపీడీఓ, అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ (ఏపీఎం), సెర్ప్, వయోజన విద్యాశాఖ పర్యవేక్షకులు పర్యవేక్షిస్తారు. డివిజనల్ స్థాయిలో ఈ కార్యక్రమాన్ని అసిస్టెంట్ ప్రాజెక్టు ఆఫీసర్ (ఏపీఓ), వయోజన విద్యా విభాగం సూపర్వైజర్ నిర్వహిస్తారు. కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి కమిటీ మద్దతుతో వయోజన విద్య శాఖ డిప్యూటీ డైరెక్టర్, అసిస్టెంట్ డైరెక్టర్, పీడీ, డీఆర్‌డీఏ, జిల్లాస్థాయిలో కార్యక్రమాన్ని అమలు చేయడానికి బాధ్యత వహిస్తారు. అక్షరాస్యత తరగతులు పూర్తైన తర్వాత, మార్చిలో జరిగే నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూల్ (ఎన్ఐఓఎస్) ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ (ఏపీఓఎస్ఎస్) ద్వారా అసెస్‌మెంట్ పరీక్ష నిర్వహించుట ద్వారా ఈ కార్యక్రమం పూర్తవుతుంది.

ఎంతో ఉపయోగకరం



ఉల్లాస్ కార్యక్రమం నిరక్షరాస్యులైన మహిళలకు ఎంతో ఉపయోగకరం. వారికి చదవడం, రాయడంతో పాటు డిజిటల్ లావాదేవీలపై కూడా పూర్తి అవగాహన కల్పిస్తారు. అలాగే సమాజం పట్ల అవగాహనతో పాటు ఆరోగ్యం, నైతిక విలువలు లాంటి అనేక అంశాలపై కూడా అవగాహన కల్పిస్తాము. ఇప్పటికే ఉల్లాస్ కార్యక్రమానికి సంబంధించి జిల్లా, మండల స్థాయిలలో పలు కమిటీలను ఏర్పాటు చేశాం. పుస్తకాల ప్రింటింగ్ కూడా పూర్తయింది. మరో వారం రోజులల్లోపు జిల్లాకు పుస్తకాలు రానున్నాయి. వచ్చిన వెంటనే కార్యక్రమాన్ని జిల్లాలో ప్రారంభిస్తాం.

- సుబ్బారెడ్డి, వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్, కడప

జిల్లాలో 23,470 మంది ఎంపిక

డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి జిల్లాలోని 35 మండలాల్లో 23,470 మందిని ఎంపిక చేశారు. ప్రతి పది మందికి ఒక వలంటీర్ చొప్పున 2347 మందిని ఎంపిక చేశారు. డ్వాక్రా సభ్యులతో పాటు మండల, జిల్లా పరిషత్తు, ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలు, సహాయకులు, వంట పనివాళ్లు, రాత్రి కాపలాదారులు, అంగన్వాడీ కేంద్రాల్లోని ఆయాలు, నిరక్షరాస్యులను ఎంపిక చేసి మార్చి 15 వరకు తరగతులు బోధిస్తారు. శిక్షణ అనంతరం వీరికి పరీక్షలు నిర్వహిస్తారు.

ఏం చేస్తారంటే...

మూడేళ్ల పాటు కొనసాగే ఈ కార్యక్రమంలో ప్రతి ఆరు నెలలకు ఒక బృందానికి పాఠాలు బోధిస్తారు. ఆరు నెలలు వ్యవధిలో 200 గంటల పాటు ఆర్థిక, సామాజిక, డిజిటల్ అక్షరాస్యతపై మహిళలకు అభ్యసన తరగతులు నిర్వహిస్తారు. ఇందుకు ప్రతి పది మందికి ఒక వలంటీర్‌ను ఎంపిక చేశారు. వీరిలో స్వచ్ఛందంగా బోధనకు వచ్చే నిరుద్యోగులతో పాటు డ్వాక్రా సంఘాల్లో చదువుకున్న మహిళలు, వీఓఏలు ఉన్నారు. వీరు సాయంత్రం 5 నుంచి 7గంటల మధ్య సమయంలో బోధిస్తారు.

మహిళలకు బోధించాల్సింది ఇదే..

కుటుంబం-ఇరుగుపొరుగు, మన ఆచార వ్యవహారాలు, పరిశుభ్రత-ఆరోగ్యం, ఎన్నికలు, పిల్లల పెంపకం-మన బాధ్యత, చట్టాలు తెలుసుకుందాం, మా ఇంటి మహాలక్ష్మి, డిజిటల్ అక్షరాస్యత ఈ అంశాల చుట్టూ తెలుగు భాష, గణిత దైనందిన వినియోగానికి సంబంధించిన నైపుణ్యాలను పెంపొందించే ఉద్దేశంతో పుస్తకాన్ని రూపొందించారు.

మృతదేహంతో ఆస్పత్రి ఎదుట నిరసన



మృతదేహంతో నిరసన తెలుపుతున్న మృతుడి కుటుంబసభ్యులు

తంబళ్లపల్లె, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): అత్యవసర వైద్య చికిత్సల కోసం ప్రభుత్వాసుపత్రికి వస్తే అంబులెన్సులో నుంచి రోగిని ఆసుపత్రిలోకి తరలించడానికి కూడా సిబ్బంది రాకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని మృతదేహంతో బంధువులు నిరసన తెలిపారు. ఈ సంఘటన తంబళ్లపల్లె మండల కేంద్రంలో గురువారం జరిగింది. బాధితులు తెలిపిన వివరాల మేరకు... తంబళ్లపల్లె మండలం గోపిదిన్నె పంచాయతీ ఉప్పులూరివాండ్లపల్లెకు చెందిన శ్రీరాములునాయక్ (58) గురువారం శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడుతుండటంతో 108లో తంబళ్లపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ క్రమంలో రోగిని అంబులెన్సులో నుంచి కిందకు దించి ఆసుపత్రిలోకి తీసుకువెళ్లడానికి ఆసుపత్రి సిబ్బంది ఎవ్వరూ ముందుకు రాలేదు. అయితే, అప్పటికే (మార్గ మధ్యలో) ఆయన మృతి చెందడంతో 108లో నుంచి కిందకు దింపి ఆసుపత్రిలోకి తరలించడానికి సిబ్బంది ససేమిరా అని.. మీరే తీసుకువెళ్లండి అని చెప్పారు. శ్రీరాములు నాయక్ ప్రాణంతో ఉన్నాడా, లేదా అని పరీక్షించడానికి సైతం ఎవ్వరూ ముందుకు రాకపోగా ఆసుపత్రి బయట స్ట్రెచర్‌పైనే ఉంచడంతో కుటుంబసభ్యులు వైద్య సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసి నిరసన తెలిపారు. దీంతో కొంతసేపటి తర్వాత విధుల్లో ఉన్న వైద్యుడు వచ్చి రోగిని పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. అత్యవసర సమయాల్లో ఆసుపత్రికి వచ్చే రోగులను కూడా సిబ్బంది పట్టించుకోలేదని.. ఇంత పెద్ద ఆసుపత్రిలో రోగులకు ఇక వైద్యం ఏమి అందుతుందని మృతుడి అల్లుడు మాజీ సర్పంచ్ రమణానాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానికులు, కూటమి నాయకులు ఆసుపత్రి వద్దకు చేరుకుని వైద్యులు, సిబ్బంది పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

యోగాసన పోటీల్లో ద్వితీయ స్థానం

- ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి ప్రతిభ

సంబేపల్లె, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): జాతీయ యోగాసన పోటీల్లో ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి ఉత్తమ ప్రతిభ కనబరచినట్లు ఎంఈవో శ్రీనివాసులు తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని సంబేపల్లె హైస్కూల్‌లో కాంప్లెక్స్ ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఝార్ఖండ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో డిసెంబరు 26 నుంచి 31వ తేదీ వరకు 6 రోజుల పాటు జరిగిన 43వ జాతీయ యోగాసన పోటీల్లో ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి పాల్గొని అద్భుత ప్రతిభ కనబరచి ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నట్లు తెలిపారు. ఈమె సంబేపల్లె మండలం గొల్లపల్లి ప్రాథమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంబేపల్లె ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి, కేజీబీవీ ప్రిన్సిపాల్ పద్మావతి, ఉపాధ్యాయులు ప్రభాకర్‌రెడ్డి, చంద్రశేఖర్, సుభాషిణి, జగదీశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయురాలు విజయలక్ష్మిని సన్మానిస్తున్న దృశ్యం

సేంద్రియ వ్యవసాయానికి ఐటీసీ వెన్నుదన్ను



రైతు శివ వ్యవసాయ క్షేత్రంలో ఐటీసీ ప్రతినిధులు

పీలేరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ, ప్రకృతి వ్యవసాయానికి తమ సంస్థ వెన్నుదన్నుగా నిలుస్తుందని ఐటీసీ సంస్థ దక్షిణ భారత ఎఫ్‌పీవోల అభివృద్ధి మేనేజర్ పురుషోత్తం తెలిపారు. పూర్తిగా ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో మామిడిని సాగు చేస్తున్న కేవీపల్లె మండలం నూతనకాల్వకు చెందిన రైతు శివ వ్యవసాయక్షేత్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేంద్రియ ఉత్పత్తులకు మార్కెట్‌లో బాగా డిమాండ్ ఉన్నప్పటికీ తగినంత లభ్యత లేకపోవడంతో చాలా మంది రసాయనిక ఉత్పత్తులనే వాడుతున్నారన్నారు.

వారందరికీ సేంద్రియ ఉత్పత్తులను అందుబాటులోకి తేవాలన్న లక్ష్యంతో తమ సంస్థ సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తోందన్నారు. అందులో భాగంగా మామిడి, బొప్పాయి, అరటి పంటల్లో ఇప్పటికే సేంద్రియ, ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటిస్తున్న రైతులను గుర్తించి వారి పంటలను కొనేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. అంతేకాకుండా ఆ మూడు పంటలు సాగుచేసే ఆసక్తి ఉన్న రైతులకు తమ సంస్థ ద్వారా సాంకేతిక శిక్షణ ఇవ్వడంతో పాటు కొంతమేర ఇన్‌పుట్ సబ్సిడీ కూడా అందజేస్తామన్నారు. రెండు, మూడేళ్ల మామిడి తోటలు ఉన్న వారు పూర్తిగా సేంద్రియ పద్ధతిలోకి మారేందుకు కావాల్సిన సాంకేతిక శిక్షణ అందిస్తామన్నారు. తమ పర్యవేక్షణలో పండించిన పంటలను తామే కొనుగోలు చేస్తామని, అలా తమకు అమ్మడానికి ఇష్టపడని రైతులు వారికి కావాల్సిన చోట అమ్ముకోవచ్చునన్నారు. సేంద్రియ, ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తున్న రైతుల గురించి తాము జరిపిన అన్వేషణలో పీలేరుకు చెందిన ప్రముఖ ప్రకృతి వ్యవసాయ నిపుణుడు బోదేషావలి ద్వారా రైతు శివ గురించి తెలిసి ఆయన వ్యవసాయక్షేత్రాన్ని పరిశీలించామన్నారు. త్వరలోనే శివ వ్యవసాయక్షేత్రాన్ని తమ సాంకేతిక నిపుణుల బృందం పరిశీలిస్తుందని, పీలేరు ప్రాంతంలో తాము ఈ మామిడి సీజన్ నుంచే కార్యకలాపాలు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల రైతులు బోదేషావలిని 9703635827 నెంబరులో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఐటీసీ సంస్థ భాగస్వామి అయిన 'బ్రెడ్స్' ఎన్‌జీవో సీనియర్ మేనేజర్ బోజిరాజు, బోదేషావలి పాల్గొన్నారు.

ములకలచెరువులో టెన్షన్.. టెన్షన్...

- మండల సర్వసభ్య సమావేశంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు
- ఓవైపు టీడీపీ, మరోవైపు వైసీపీ వర్గీయుల మోహరింపు
- ఇరువర్గాల వారిని నిలువరించిన పోలీసులు
- మండల సమావేశం వాయిదా
- ఎంపీడీవోపై వైసీపీ నేతల దౌర్జన్యం
- మినిట్స్ బుక్ లాక్కుని... ఎంపీడీవోపై నానా దుర్భాషలు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన ఎంపీడీవో



మినిట్స్ బుక్‌ను లాక్కున్న వైసీపీ ప్రజాప్రతినిధులను హెచ్చరిస్తున్న ఎస్ఐ నరసింహుడు

ములకలచెరువు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ములకలచెరువు మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం సందర్భంగా గురువారం తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ప్రజాస్వామ్యబద్ధంగా గెలవని వైసీపీ ప్రజాప్రతినిధులకు సమావేశానికి వచ్చే అర్హత లేదని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లె జయచంద్రారెడ్డి సూచనలతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో ఎంపీడీవో కార్యాలయం వద్దకు చేరుకున్నారు. సెలెక్టెడ్ ఎంపీటీసీలు, సర్పంచులు గో బ్యాక్ అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. సమావేశం నిర్వహించేందుకు హైకోర్టు ఉత్తర్వులు ఉన్నాయని సమావేశం నిర్వహించాలని పోలీసులు టీడీపీ శ్రేణులను అడ్డుకున్నారు. అలాగే కార్యాలయం వద్దకు వైసీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా చేరుకున్నారు. టీడీపీ శ్రేణులు ఓవైపు....వైసీపీ నాయకులు మరోవైపు ఉండడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా మదనపల్లె డీఎస్పీ కొండయ్యనాయుడు, ములకలచెరువు, బి.కొత్తకోట, మదనపల్లె, పుంగనూరు సీఐలు, ఎస్ఐలు, పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి ఇరువర్గాలను అదుపు చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రచార సమన్వయకర్త సీడు మల్లికార్జుననాయుడు, బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేవీ రమణ, టీడీపీ నేతలు విశ్వనాథరెడ్డి, కట్టా సురేంద్రనాయుడు, తులసీధర్‌నాయుడు, తంబళ్లపల్లె, కురబలకోట మండలాల టీడీపీ అధ్యక్షుడు రెడ్డెప్పరెడ్డి, వైజీ సురేంద్రయాదవ్ తదితరులు మాట్లాడుతూ దమ్ముంటే ప్రజాస్వామ్యబద్ధంగా గెలిచి సమావేశాలకు రావాలన్నారు. వైసీపీ ప్రజాప్రతినిధులు పుంగనూరు నుంచి రౌడీలను పిలుచుకొచ్చి ఇక్కడ దౌర్జన్యం చేస్తున్నారన్నారు. ఈ క్రమంలో వైసీపీ ప్రజాప్రతినిధులు 11.05 గంటలకు సమావేశానికి హాజరయ్యేందుకు కార్యాలయంలోకి వెళ్లారు. అయితే ఉదయం 10.30 గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశానికి 11 గంటల వరకు సభ్యులు ఎవరూ హాజరు కాకపోవడంతో కోరం లేక సమావేశాన్ని వాయిదా వేసినట్లు ఎంపీడీవో హరినారాయణ ప్రకటించారు. వాయిదా వేసిన ఐదు నిమిషాలకు కార్యాలయంలోకి వచ్చిన వైసీపీ ప్రజాప్రతినిధులు ఆగ్రహంతో ఎండీడీవోపై చిందులు తొక్కారు. తరువాత ఎంపీడీవో ఛాంబర్‌లోకి వెళ్లి మినిట్స్ బుక్‌ను లాక్కొని నానా దుర్భాషలాడారు. సమావేశం వాయిదా వేసే ముందు తమకు ఫోన్ చేసి చెప్పకుండా ఏం పీకుతున్నావు నీవు అంటూ తిట్టారు. దీంతో అక్కడే ఉన్న ఎస్ఐ నరసింహుడు గవర్నమెంట్ ప్రాపర్టీ అయిన మినిట్స్ బుక్‌ను తీసుకునే అర్హత మీకు లేదని, వెంటనే మినిట్స్ బుక్‌ను ఇవ్వాలని హెచ్చరించడంతో కొంతసేపటికి ఇచ్చారు. టీడీపీ నిరసన కార్యక్రమంలో నాయకులు గంగాదేవి, మూగి రవిచంద్ర, భాస్కర్‌రెడ్డి, యల్లారెడ్డి, సిద్ధవరం ప్రసాద్, కిట్టన్న, నారాయణ, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు ఫిర్యాదు చేసిన ఎంపీడీవో

ములకలచెరువు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో జరిగిన వైసీపీ ప్రజాప్రతిధుల దౌర్జన్యంపై ఎంపీడీవో హరినారాయణ గురువారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశంను ఉదయం 10.30 గంటలకు ఏర్పాటు చేశామని, సమావేశంకు అధ్యక్ష, ఉపాధ్యక్షులు, ఎంపీటీసీలు హాజరుకాకపోవడంతో కోరం లేక వాయిదా వేశామని తెలిపారు. తమ కార్యాలయ సిబ్బంది చూస్తుండగా నా వద్ద నుంచి మండల పరిషత్ తీర్మాన పుస్తకాన్ని వైసీపీ జడ్పీటీసీ మోహన్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు లాక్కున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇంతటితో ఆగకుండా నన్ను తిట్టి, భయభ్రాంతులకు గురిచేసి విధులకు ఆటంకం కలిగించారని, ఆ జడ్పీటీసీ, ఎంపీటీసీలు కొంతమందిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు పత్రాన్ని ఎస్ఐ నరసింహుడుకు అందజేశారు.





ఎంపీడీవో కార్యాలయం వద్ద నిరసన తెలియచేస్తున్న టీడీపీ వర్గీయులను అడ్డుకుంటున్న పోలీసులు, మరోవైపు మోహరించిన వైసీపీ వర్గీయులు

గుండెపోటుతో హెడ్‌కానిస్టేబుల్ మృతి



దాసరి భాస్కర్ (ఫైల్)

రాయచోటిటౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న దాసరి భాస్కర్ (51) గురువారం గుండెపోటుతో మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే... లక్కిరెడ్డిపల్లె మండలం గాండ్లవానిపల్లెకు చెందిన హెడ్ కానిస్టేబుల్ దాసరి భాస్కర్ రాయచోటి అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. నాలుగు నెలల క్రితం హైదరాబాదులో గుండె జబ్బుకు చికిత్స చేయించుకుని వచ్చాడు. ఈ క్రమంలో రెండు రోజులు ఆయాసంతో బాధపడుతున్న భాస్కర్‌కు గురువారం మరోసారి గుండెపోటు రావడంతో మృతి చెందాడు.

ఇతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న రాయచోటి అర్బన్ సీఐ చంద్రశేఖర్‌తో పాటు ఎస్ఐలు, సహచర పోలీసులు హెడ్‌కానిస్టేబుల్ మృతదేహాన్ని సందర్శించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు వారి ఇంటి వద్దకు వెళ్లి మృతదేహాన్ని సందర్శించి వారి కుటుంబానికి ధైర్యం చెప్పారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య



పకీర్‌సాబ్ మృతదేహం

రాయచోటిటౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని మాసాపేటలో వరిగ రోడ్డులో నివాసం ఉంటున్న పకీర్‌సాబ్ (68) అనే వ్యక్తి చెడు వ్యసనాలకు బానిసై అప్పుల బాధతో గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొంతకాలంగా మద్యం, జూదం తదితర చెడు వ్యసనాలకు అలవాటు పడ్డ పకీర్‌సాబ్ అక్కడక్కడా అప్పులు చేస్తూ వాటిని తిరిగి తీర్చలేక ఒత్తిడి ఎక్కువ కావడంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇతనికి భార్య, పిల్లలు ఉన్నారు. మృతుడి కుమారుడు మౌలానా ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాయచోటి ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ సీఐ చంద్రశేఖర్ తెలియజేశారు.

బాధితులకు న్యాయం చేస్తాం : ఆర్డీఓ



రోడ్డు పనులు పరిశీలిస్తున్న ఆర్డీఓ

బ్రహ్మంగారిమఠం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే బెంగళూరు-విజయవాడ పనుల కోసం భూములు కోల్పోయిన వారికి న్యాయం చేస్తామని బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్ తెలిపారు. గురువారం మల్లేపల్లె పరిసరాల్లో రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. భూములు కోల్పోయి నష్టపరిహారం రాని వారితో మాట్లాడారు. తహసీల్దారు దామోదర్‌రెడ్డి లబ్ధిదారుల వివరాలను ఆర్డీఓకు అందించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి మండల నాయకులు సాంబశివారెడ్డి, పూజా శివయ్య యాదవ్, శ్రీను, రమేశ్, మేకల సుధాకర్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లాస్థాయి సైన్స్‌ఫెయిర్

- 36మండలాల నుంచి రానున్న ప్రాజెక్టులు
- కడప ఉప విద్యాధికారి జి.రాజగోపాల్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కడప మున్సిపల్ హైస్కూల్ మెయిన్‌లో జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్‌ను శుక్రవారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఉప విద్యాశాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం జిల్లా సైన్స్ ఆఫీసర్ యబనైజర్ ఇమ్మానుయేల్, కడప మండల విద్యాశాఖాధికారి గంగిరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగమణి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమిటీలోని ఉపాధ్యాయులందరూ సమష్టి కృషితో సైన్స్ ఫెయిర్‌ను విజవయంతం చేయాలని సూచించారు. జిల్లాలోని 36 మండలాల నుంచి వ్యక్తిగత విభాగంలో 36, గ్రూపు విభాగంలో 36, ఉపాధ్యాయ విభాగంలో 36 చొప్పున సైన్స్ ప్రాజెక్టులు ప్రదర్శిస్తారని తెలిపారు. ఇందులో ఉత్తమ ప్రాజెక్టును ప్రతి విభా గంలో రెండు ఎంపిక చేస్తామన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, ఉపాధ్యాయుల పర్యవేక్షణ, విద్యార్థుల సందర్శన వంటి కార్యక్రమాలతో జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్‌ను విజయవంతం చేయాలని సూచించారు. కమిటీ సభ్యులు దశరథరామిరెడ్డి, కేశవరెడ్డి, నిత్యానందరెడ్డి, గంగాధర్, కృష్ణకిషోర్, విజయప్రసాద్, బాలకృష్ణ, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జిల్లా స్థాయి సైన్స్‌ఫెయిర్‌పై కమిటీ సభ్యులకు సూచనలు ఇస్తున్న కడప ఉప విద్యాధికారి రాజగోపాల్‌రెడ్డి

వైవీయూకు ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ సర్టిఫికెట్

కడప ఎడ్యుకేషన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): యోగివేమన యూనివర్సిటీ వసతి గృహాలలో నాణ్యమైన భోజనం, ఆహార పదార్థాలు విద్యార్థులకు ఇస్తున్నట్లు గుర్తించి ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) సర్టిఫికెట్ లభించింది. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ పుత్తా పద్మ సమక్షంలో వైవీయూ కళాశాల ప్రిన్సిపాల్, విశ్వవిద్యాలయ వసతి గృహాల చీఫ్ వార్డన్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డికి ఆంధ్రప్రదేశ్ రూకో ప్రాజెక్టు హెడ్ అల్లూరి సంపత్ కుమార్ ఎఫ్ఎస్ఎస్ఏఐ సర్టిఫికెట్‌ను అందజేశారు. సంపత్‌కుమార్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయ వసతిగృహాల్లో లభించే ఆహార పదార్థాలను ఆకస్మికంగా పరిశీలన చేసినపుడు నిపుణులు నాణ్యతా ప్రమాణాలను గుర్తించారన్నారు. భవిష్యత్తులో ఈ సర్టిఫికెట్ ఇలానే కొనసాగించాలంటే అధికారులు, వార్డన్లు నిత్య పర్యవేక్షణ అవసరమన్నారు. వీసీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని పెన్నా, పాపాఘ్ని, చిత్రావతి, చెయ్యేరు మెస్‌లకు ఎఫ్ఎస్ఎస్ఏఐ సర్టిఫికెట్ రావడం సంతోషదాయకమన్నారు. అనంతరం రిజిస్ట్రార్ ఆచార్య పద్మ, ప్రిన్సిపల్ ఎస్.రఘునాథరెడ్డి మాట్లాడారు. సమావేశంలో ఐక్యుఏసీ డైరెక్టర్ సుబ్రమణ్యంశర్మ, సహాయ డైరెక్టర్ సుభాష్‌చంద్ర, పీఆర్ సెల్ సంచాలకులు డాక్టర్ పి. సరిత, వార్డన్లు తదితరులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లతో వీసీ కృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి, రిజిస్ట్రార్ పద్మ తదితరులు

కువైత్‌లో వేంపల్లె వాసి మృతి

వేంపల్లె, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె శ్రీరామ్‌నగర్‌కు చెందిన సగినాల శివకుమార్ (38) కువైత్‌లో బుధవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల వివ రాల మేరకు... వీరన్నగట్టుపల్లెకు చెందిన శివకుమార్ వేంపల్లె శ్రీరామ్‌నగర్‌లో భార్య పిల్లలతో కలసి నివాసం ఉండేవాడు. ఇక్క డ సరైన ఉపాధి దొరక్క ఎనిమిది సంవత్సరాల క్రితం కువైత్‌కు వెళ్లాడు. ఏడాదికో రెండేళ్లకు ఒకసారి ఇంటికొచ్చి వెళ్లేవాడు. ఇటీవల వచ్చిన శివకుమార్ రెండు నెలల క్రితం మళ్లీ కువైత్‌కు వెళ్లాడు. బుధవారం కువైత్‌లోని గదిలో పడుకొని ఉండగా గుండెపోటు రావడంతో మృతి చెందాడు. మధ్యాహ్నం తర్వాత అక్కడి సేఠ్ ఇతరులు గదిలోకి వెళ్లిచూడగా అప్పటికే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కువైత్‌లో ఉన్న బంధువుల సహకారంతో మృతదేహాన్ని వేంపల్లెకు తెప్పించేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి పేదకుటుంబాన్ని ఆదుకోవాలని వేడుకుంటున్నారు.



శివకుమార్ (ఫైల్)

వివాహిత ఆత్మహత్య



ఎర్రగుంట్ల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మలపల్లికి చెందిన వనంనేత్ర (18) బుధవారం రాత్రి ఇంట్లో ఉరివేసుకుంది. డబ్బుల విషయంలో భర్త నాగరాజు మందలించడంతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లుగా తెలిసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కడప క్రైం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కడప నగరం అక్కాయపల్లె వద్ద టీవీఎస్ వాహనంలో ఓ వ్యక్తి వెళుతూ కింద పడి తీవ్రగాయాలయ్యాయి. రిమ్స్‌లో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు తాలుకా పోలీసులు తెలిపారు. అక్కాయపల్లె చెందిన హర్షద్ ఆలీ (58) ఆర్టీసీలో పనిచేస్తున్నాడు. బుధవారం రాత్రి టీవీఎస్ వాహనంలో ఇంటికి వెళుతుండగా స్కూటరుపై నుంచి కింద పడటంతో గాయపడ్డాడు. స్థానికులు రిమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

డబ్బు కోసం మా నాన్నను మనవడే చంపాడు

- నెల తరువాత కొడుకు ఫిర్యాదు
- విచారణ చేపడుతున్న పోలీసులు

మైదుకూరు రూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మా నాన్న పొలం అమ్మిన డబ్బులు ఇవ్వాలని వేధించి.. ఆయన మనవడు చంపేశాడని కుమ్మరి రమేష్ గురువారం మైదుకూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని శెట్టివారిపల్లెకు చెందిన వీరారెడ్డికి మొదటి భార్య కుమారుడు రాఘువరెడ్డితో పాటు ముగురు అక్క చెల్లెళ్లు, రెండో భార్యకు రమేష్ ఏకైక సంతానం. గతంలో అందరూ శెట్టివారిపల్లెలోనే నివాసం ఉండేవారు. తరువాత వీరారెడ్డి మొదటి భార్య, రెండో భార్యకు సఖ్యత లేకపోవడంతో రెండో భార్య సుబ్బమ్మ, అమె కుమారుడు రమేష్ ప్రొద్దుటూరు మండలం గోప వరం సమీపంలోని యానాది కాలనీలో నివశించేవారు. వీరారెడ్డి వస్తూ పోతుండేవాడు. ఈ నేపథ్యంలో మొదటి భార్య కుమారుడు రాఘువరెడ్డికి కరెంటుషాక్ తగిలి మృతి చెందాడు. ఆ తరువాత కొంత కాలానికి వీరారెడ్డి మొదటి భార్య, రెండో భార్య అనా రోగ్యంతో మరణించారు. వీరారెడ్డికి పక్షవాతం రావడంతో ఆయనకు నేనే దగ్గరుండి వైద్యం చేయించి బాగు చేశానని రమేష్ తెలిపారు. తొమ్మిది నెలల క్రితం వీరారెడ్డి పేరు మీద ఉన్న ఎకరం పొలం అమ్మగా ఏడు లక్షల రూపాయల వచ్చిందని, ఆ డబ్బులు ఇవ్వాలని మొదటి భార్య మనవడు హరినాథ్‌రెడ్డి తరచూ వేధిస్తున్నట్లు చెప్పేవాడని రమేష్ ఫిర్యాదులో పేర్కొ న్నారు. గత నెల 6వ తేదీ మా నాన్న చనిపోయాడని తెలిసి అంత్యక్రియలు చేసి తిరిగి మా గ్రామానికి వచ్చేశామని తెలిపారు. అయితే హరినాథ్‌రెడ్డి మా నాన్న వీరారెడ్డిని ముక్కు నోరు మూసి చంపివేశాడని గ్రామస్తుల ద్వారా సమాచారం తెలియడంతో గురువారం మైదుకూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ ఆదేశాల మేరకు సీఐ హసం, ఎస్ఐ చిరంజీవి విచారణ చేపట్టారు.

డీఆర్పీలుగా ఉపాధి అవకాశాలు

- డీఆర్డీఏ పీడీ ఆనందనాయక్

కడప ఎన్టీఆర్ సర్కిల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీలో జిల్లా రీసోర్స్ పర్సన్స్(డీఆర్‌పీ)గా పనిచేసేందుకు ఉపాధి అవకాశాలు ఉన్నట్లు డీఆర్డీఏ పీడీ ఆనందనాయక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో పీఎం ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ (పీఎం ఎఫ్ఎంఈ)ని సమర్థవంతంగా అమలు చేసేందుకు మండల స్థాయిలో రీసోర్స్ పర్సన్‌లను ఎంపిక చేయ డం జరుగుతుంది. ఏదైన డిగ్రీ ఉత్తీర్ణత సాధించి కంప్యూటర్ ఇంటర్నెట్ ప్రావీణ్యం కలిగి ఉండాలని తెలిపారు. ప్రయాణాలు చేసేందుకు ఆసక్తి కలిగి ఉండి స్మార్ట్‌ఫోన్ వినియోగించే వారు అర్హులన్నారు. గత ఏడాది నవంబరు 1వ తేదీ నాటికి 21 నుంచి 30ఏళ్లు కలిగిన వారై ఉండాలన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ సహజ వనరుల అభివృద్ధి రం గంలో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 5లోపు మండలంలో ఉన్న వెలుగు కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సిందిగా సూచించారు. 8వ తేదీ రాజంపేట రోడ్డులోని టీటీడీసీలో రాత పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంపికైన వారికి రూ.20వేలు ప్రోత్సాహక ప్రతిపాదికన చెల్లించడం జరుగుతుందన్నారు. అర్హతలు, ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల 5లోపు ఆయా మండల సమాఖ్యావెలుగు కార్యాలయాల్లో తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సిందిగా ప్రకటనలో కోరారు.

5న జిల్లా బాలుర హాకీ జట్ల ఎంపికలు

పులివెందుల టౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): వైఎస్ఆర్ కడప జిల్లా బాలుర జూనియర్, సబ్ జూనియర్ హాకీ జట్ల ఎంపికలు ఈ నెల 5న పులివెందులలోని వైఎస్ఆర్ ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ అకాడమీలో జరగనున్నట్లు హాకీ కడప జిల్లా సెక్రటరీ ఎం.శేఖర్ తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పులివెందులలో ఎంపికైన సబ్ జూనియర్ బాలుర జట్టు ఈ నెల 17వ తేదీ నుంచి 19 వరకు మదనపల్లెలో జరిగే 14వ రాష్ట్రస్థాయి బాలుర సబ్ జూనియర్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటుందన్నారు. ఈఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు ఖచ్చితంగా 1.1.2009 తరువాత జన్మించిన వారై ఉండాలన్నారు. అదే విధంగా జూనియర్ విభాగంలో ఎంపికైన బాలుర జట్టు ఈనెల రెండో వారంలో కాకినాడలో జరిగే ఏపీ రాష్ట్ర స్థాయి జూనియర్ బాలుర చాంపియన్ షిప్‌లో పాల్గొంటుంద న్నారు. ఇందులో పాల్గొనే క్రీడకారులు 1.1.2006వ తేదీ తరువాత జన్మించిన వారై ఉండాలన్నారు. ఈ ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు తమ వెంట ఆధార్‌కార్డు, బర్త్ సర్టిఫికెట్‌లను తీసుకుని ఈ నెల 5న ఉదయం 9గంటలకు పులివెందుల స్పోర్ట్స్ అకాడమీలో రిపోర్టు చేయాలని ఆయన తెలిపారు.

జువారిలో కేంద్ర మంత్రికి విందు

ఎర్రగుంట్ల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర శాస్త్ర సాంకేతిక, భౌగోళికశాస్త్ర శాఖ మంత్రి డాక్టర్ జితేంద్రసింగ్ గురువారం ఎర్రగుంట్లలోని జువారి కర్మాగారం అతిథి గృహానికి వచ్చారు. స్థానిక యాజమాన్యం, నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అక్కడ ఆయన మధ్యాహ్నం భోజనం చేసి విశ్రాంతి తీసుకు న్నారు. అనంతరం ఎమ్మెల్యే, కలెక్టర్ తదితరులతో కలిసి గండికోటకు వెళ్లారు. ఆయన వెంట ఎమ్మెల్యే ఆదినారా యణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి సి.భూపేష్‌రెడ్డి, బీజేపీ నాయకులు ఉన్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యత

వల్లూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ్య పుణ్యక్షేత్రమైన పుష్పగిరి క్షేత్రం అబివృద్ధితో ముందుకు తీసకెళ్తారని దేవాదాయ అసిస్టెంటు కమిషనరు మల్లిఖార్జున అన్నారు. గురువారం మండల పరిధిలోని క్షేత్రాన్ని ఆయన పరిశీలించారు. ముందుగా ఆలయం చుట్టుపక్కల ఉన్న చెత్త చెదారాన్ని మైదుకూరు, ప్రొద్దుటూరు నుంచి వచ్చిన భక్త సమూహంతో పరిశుభ్రం చేయించారు. అనంతరం వారందరికీ ధన్యవాదాలు తెలిపా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరశుభ్రతకే తాను మొదట ప్రాధాన్యత ఇస్తామన్నారు.

ఇంటర్నేషనల్ షూటింగ్ బాల్‌గేమ్స్‌కు హరిబాబు ఎంపిక



పోరుమామిళ్ల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ షూటింగ్ బాల్‌గేమ్స్‌కు రాయపాటి హరిబాబు అనే విద్యార్థి ఎంపికయ్యాడు. పోరుమామిళ్ల మండలం నాగులకుంట్లకు చెందిన హరిబాబు త్వరలో నేపాల్‌లో జరగబోయే ఇంటర్నేషనల్ గేమ్స్‌లో ఆడనున్నాడు. హరిబాబు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించి షూటింగ్ బాల్ ఇంటర్నేషనల్‌కు ఎంపికయ్యాడు. ప్రస్తుతం ఈ విద్యార్థి కడప ఐటీఐలో డీజిల్ మెకా నిక్‌గా చదువుతున్నాడు.

లా, బీఈడీ అడ్మిషన్లకు రిజిస్ట్రేషన్ గడువు పెంపు

అమరావతి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): లా, బీఈడీ కోర్సుల్లో అడ్మిషన్లకు రిజిస్ట్రేషన్ల గడువును ఈనెల 5 వరకు పొడిగించినట్లు ఉన్నత విద్యామండలి ఓ ప్రకటనలో తెలిపింది. యూనివర్సిటీల్లో స్పాట్ అడ్మిషన్లు, ప్రైవేటు లా, బీఈడీ కాలేజీల్లో కేటగిరీ బీ అడ్మిషన్లకు ఈ గడువు వర్తిస్తుందని తెలిపింది. అభ్యర్థుల వినతి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. ఇకపై ఎలాంటి పొడిగింపు ఉండదని స్పష్టం చేసింది.

మధ్యాహ్న భోజనంలో శనివారం మెనూ మార్పు

అమరావతి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకంలో శనివారం అందించే ఆహారం మెనూను సవరిస్తూ మధ్యాహ్న భోజనం పథకం డైరెక్టర్ బి.శ్రీనివాసరావు గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుత మెనూ ప్రకారం శనివారం రోజున విద్యార్థులకు ఆకు కూర అన్నం(పాలకూర, కొత్తిమీర, కరివేపాకు, పుదీనా), పప్పుచారు, స్వీట్ పొంగల్, రాగి జావ ఇస్తున్నారు. ఇక నుంచి ఆకు కూర అన్నం స్థానంలో సాధారణ అన్నం పెట్టి, స్థానికంగా అందుబాటులో ఉండే కూరగాయలతో కూర, స్వీట్ పొంగల్, రాగి జావ అందించాలని ఆదేశించారు.

ఏపీఎండీసీకి నష్టం వస్తే ఊరుకోం

- సమ్మె నోటీసు అందజేసిన కార్మిక సంఘాల నాయకులు

ఓబులవారిపల్లె, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఏపీఎండీసీ సంస్థ అభివృద్ధికి నష్టం వాటిల్లేలా చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదని కార్మిక సంఘాలతో కలిసి సీపీవోకు సమ్మె నోటీసును అందజేశారు. ఏపీఎండీసీ మంగంపేట సంస్థకు నష్టం కలిగేలా సీ అండ్ డీ, డబ్ల్యూ గ్రేడ్ ముగ్గురాయి బల్క్ టెండరును రద్దు చేయాలని, లేదంటే జనవరి 16 నుంచి సమ్మె చేస్తామని సీపీవో ద్వారా కార్మిక సంఘాల నాయకులు ఏపీఎండీసీ ఎండీకి నోటీసులు అందజేశారు. ఈ మేరకు అడ్మినిస్ట్రేటేషన్ బిల్డింగ్ ప్రాంగణంలో గురువారం సమావేశమయ్యారు. కార్మిక నాయకులు మాట్లాడుతూ 1975 నుంచి ఏపీఎండీసీ ఆధ్వర్యంలో పలు ప్రైవేటు కంపెనీలు ఖనిజాన్ని వెలికి తీస్తున్నాయని, మంగంపేటలో ఏపీఎండీసీగా ఉన్న సంస్థను, గ్రామాలను కలుపుకుని అభివృద్ధి చేస్తామంటూ చెప్పి ఇప్పటికీ మోసం చేస్తూనే ఉన్నారని, 90 శాతం పర్మినెంట్ ఉద్యోగాలు నేటికీ ఖాళీగానే ఉన్నాయని ఆరోపించారు. ప్రస్తుతం ఏపీఎండీసీ స్టాక్‌పాయింట్‌లో సీడీ, డబ్ల్యూ గ్రేడ్ ముగ్గురాయి 83 లక్షల టన్నులు, మైనింగ్‌లో 60 లక్షల టన్నులు ఉందన్నారు. జాయింట్ వెంచర్‌గా ఉన్న ఐబీసీ ఏబీసీపీఎల్‌ని గాలికొదిలేశారని విమర్శించారు. ఈ నెల 15 లోపు డిమాండ్‌లు తీర్చకపోతే 16 నుంచి నిరవధిక సమ్మెకు వెళతామని ఏపీఎండీసీ ఎంప్లాయీస్ యూనియన్, ఏపీఎండీసీ వర్కర్స్ యూనియన్, ఏపీఎండీసీ ట్రైనీ, కార్మిక పోరాట సంఘాల నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

5న రంగనాథస్వామి కల్యాణోత్సవం

రాజంపేటటౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తోట కల్యాణ మండపంలో ఈ నెల 5న ఆదివారం ఉదయం 9 గంటలకు జరిగే ప్రసన్న రంగనాథస్వామి, గోదాదేవి, మహాలక్ష్మీదేవి సమేత కల్యాణోత్సవానికి సంబంధించిన కరపత్రాలను గురువారం సాయంత్రం తిరుప్పావై భక్తసేవాసమితి సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్యనిర్వాహక సభ్యురాలు సరిత మాట్లాడుతూ నూతన సంవత్సరం సందర్భంగా ఈ ఏడాది ప్రజలకు అన్నిరకాల మంచి జరగాలన్న ఉద్దేశ్యంతో గత మూడేళ్లుగా నిర్వహిస్తున్న కల్యాణోత్సవంలో భాగంగా ఈ ఏడాది కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కల్యాణోత్సవానికి సంబంధించి ఐదో తేదీ ఉదయం 9 గంటల నుంచి గోదాదేవి, మహాలక్ష్మీదేవి, ప్రసన్నరంగనాథస్వామి కల్యాణోత్సవాన్ని ఎంతో వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రముఖ ఆధ్యాత్మిక గాయకులు, గిన్నీస్ రికార్డు గ్రహీత వెంకటేశ్వర్లు, కోటపాటి గోవిందదాస్ ఆధ్వర్యంలో అన్నమాచార్య సంకీర్తన కార్యక్రమం ఉంటుందన్నారు. మధ్యాహ్నం అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు ఈ కల్యాణోత్సవానికి హాజరై దేవదేవుని కృపాకటాక్షాలకు పాత్రులు కావాలని విజ్ఞప్తి చేశారు.

లక్ష్యం ఘనం..సంపద శూన్యం

- నిరుపయోగంగా చెత్త సంపద కేంద్రాలు
- గ్రామాల్లో దర్శనమిస్తున్న చెత్త దిబ్బలు
- దుర్గంధంతో ఇబ్బందుల్లో ప్రజలు


పిచ్చి మొక్కలతో నిరుపయోగంగా మారిన చెత్త సంపద కేంద్రం


పెద్ద దిబ్బగా పేరుకుపోయిన చెత్త

తంబళ్లపల్లె, జనవరి 2(ఆంధ్రజ్యోతి): లక్షలు వెచ్చించినా లక్ష్యం మాత్రం నెరవేడంలేదు. దీంతో లక్షలాది ప్రభుత్వ ధనం నిరుపయోగంగా మారుతోంది. గత టీడీపీ ప్రభుత్వం 2014-19 మధ్య కాలంలో తంబళ్లపల్లె మండలంలో లక్షలాది రూపాయలు వెచ్చించి దాదాపు అన్ని పంచాయతీలలోని గ్రామ శివార్లలో చెత్త సంపద కేంద్రాలు నిర్మించారు. గ్రామాల్లో చెత్తను సేకరించడానికి గ్రీన్ అంబాసి డర్లను నియమించి చెత్తను తరలించడానికి బ్యాటరీ వాహనాలు, ఆటోలు మంజూరు చేశారు. గ్రామాల్లో సేకరించిన తడి, పొడి చెత్త, వ్యర్థాల ద్వారా కేంద్రాల్లో వర్మీకంపోస్టు ఎరువును తయారు చేసి దానిని రైతులకు విక్రయించడం ద్వారా పంచాయతీలకు ఆదాయం కల్పించాలనేది వాటి లక్ష్యం. అయితే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వాటిని పట్టించుకోకపోవడంతో దీంతో వాటి నిర్వహణపై పంచాయతీ అధికారులు దృష్టి సారించకపోవడంతో పలు గ్రామాల్లో చెత్త సంపద కేంద్రాలు అలంకారప్రాయంగా దర్శనమిస్తు న్నాయి. చాలా కేంద్రాల్లో పిచ్చి మొక్కలు మొలిచి రూపు రేఖలు కోల్పోయాయి.

చెత్తను పోగేసి..నిప్పు రాజేసి

తంబళ్లపల్లె మండల కేంద్రానికి సమీపంలో మల్లయ్యకొండకు వెళ్లే దారి పక్కనే చెత్త సంపద కేంద్రం నిర్మించారు. ఈ కేంద్రం చుట్టూ పంట పొలాలు ఎక్కువగా ఉన్నాయి. గ్రామంలో సేకరించిన చెత్తతో పాటుగా కోళ్ల వ్యర్థాలు ఈ కేంద్రంలోనే వేయడం, చెత్తను నెలల తరబడి తొలగించకపోవడంతో వర్షాలకు తడిచి చెత్త నుంచి విపరీతమైన దుర్వా సన వస్తోందని ఆ పరిసర ప్రాంత ప్రజలు వాపోతున్నారు. అంతేకాకుండా కేంద్రంలో పేరుకుపోయిన చెత్త దిబ్బలకు అప్పుడపుడు నిప్పు పెడుతున్నారు. ఈ నిప్పు వారం, పది రోజులైనా ఆరకుండా మంటలు చెలరేగి విప రీతమైన పొగ వ్యాపిస్తోంది. ఈ పొగను పీల్చడం వలన అనారోగ్యం పాలవుతామని, అంతేకాకుండా పంటలకు కొత్త, కొత్త రోగాలు వస్తున్నాయని ఆ ప్రాంత రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి చెత్త సంపద కేంద్రాల్లో చెత్తకు నిప్పు పెట్టకుండా వినియోగం లోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

దుర్వాసన భరించలేకుండా ఉన్నాం

డంపింగ్ యార్డు పక్కనే మాకు పొలం ఉం ది. నిత్యం ఇక్కడే వ్యవసాయ పనులు చేసుకుంటూ ఉంటాం. ఈ డంపింగ్ యార్డు కట్టింది మొదలు ఇంత వరకు ఒక్కసారి కూడా ఎరువు తయారు చేయలేదు. చెత్తతో పాటు కోళ్ల వ్యర్థాలు, ఇక్కడే వేస్తున్నారు. ఈ దుర్వాసనతో ఇక్కడ ఉండలేకపోతున్నాం. అంతేకాకుండా చెత్త దిబ్బలకు అపుడప్పుడు నిప్పు పెడుతుండడంతో తీవ్ర అనారోగ్యాలకు గురవుతుండడం తోపాటు పంటలకు కొత్త రోగాలు వస్తున్నాయి.

-రామచంద్ర, రైతు, తంబళ్లపల్లె

వర్మీకంపోస్టు ఎరువుల తయారీకి చర్యలు చేపడుతున్నాం

చెత్త సంపద కేంద్రాల్లో వర్మీకంపోస్టు ఎరువుల తయారీకి చర్యలు తీసుకుంటున్నాం. పిచ్చి మొక్కలతో నిరుపయోగంగా పడిఉన్న చెత్త సంపద కేంద్రాలలో మొక్కలు తొలగించి వినియో గంలోకి తీసుకురావడానికి కృషి చేస్తున్నాం. చెత్త కుప్పలు పేరుకుపోకుండా ఎప్పటి చెత్తను అప్పుడే సంపద కేంద్రాలకు తొలగించి కంపోస్టు ఎరువుల తయారు చేస్తున్నాం. రెండు వారాల క్రితం బదిలీపై ఇక్కడికి వచ్చాను. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగునకు పటిష్టమైన చర్యలు తీసుకుంటాం.

-రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి, తంబళ్లపల్లె

పర్యావరణ పరిరక్షణ కోసమే మొక్కల పంపిణీ


మొక్కలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

మదనపల్లె, జనవరి 2(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసమే మొక్కల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు స్థానిక ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషా పేర్కొన్నారు. మదనపల్లె నియోజకవర్గ నేత శ్రీరామ రామాంజనేయులుతో కలిసి గురువారం స్థానిక బర్మావీధిలోని సాయిబాబు మందిరంలో స్థానిక ఎమ్మెల్యే కార్యక్రమాన్ని ప్రారంభించి, పట్టణవాసులు, రైతులకు మొక్కలు పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఇంటింటా చెట్టు, ఊరంతా వనం కార్యక్రమానికి పిలుపునిచ్చారు. పవన్‌కళ్యాణ్ పిలుపు మేరకు శ్రీరామ రామాంజనేయులు మదనపల్లె నియోజకవర్గంలో నూతన సంవత్సరం సందర్భంగా 2025 మొక్కలు పంపిణీ చేయాలని నిర్ణయించి మదనపల్లె మండలంలోని రైతులకు అవసరమయ్యే టేకు, ఎర్రచందనం, అల్లనేరేడు, తదితర రకాలు మొక్కలు పంపిణీని చేశారు. కార్యక్రమంలో దాత శ్రీరామ రామాంజనేయులతోపాటు అటవీ శాఖ అధికారి జయప్రసాద్‌రావు, జనసేన నాయకులు శ్రీరామ హరిహరన్, పార్టీ పట్టణ అధ్యక్షుడు జగదీష్‌బాబు, శంకర్, కుమార్, అర్జున్, డిష్ చంద్ర, టీడీపీ నాయకులు గాంధీ, నవీన్‌చౌదరి, ఆడిటర్ ప్రసాద్, శ్రీనివాసులు, రాజా, సోమశేఖర్, త్రిష, సత్య, సోను పాల్గొన్నారు.


మొక్కలు పంపిణీ చేస్తున్న పోలీసులు, జీఎఫ్‌సీ సభ్యులు

పీలేరులో: పర్యావరణ పరిరక్షణకు సమాజంలోని ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పీలేరు అర్బన్ సీఐ యుగంధర్ పిలుపునిచ్చారు. పీలేరులోని మెయిన్ జడ్పీ ఉన్నత పాఠశాలలోని గ్రీన్ ఫింగర్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం పీలేరు పట్టణంలోని ఆలయాలు, మసీదులు, బహిరంగ ప్రదేశాలలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా విద్యార్థులు పంపిణీ చేసిన మొక్కలను అందరూ పరిరక్షించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సురేంద్రనాథరెడ్డి, ఎన్‌సీసీ అధికారి జయపాల్ రెడ్డి, గ్రీన్ ఫింగర్స్ క్లబ్ స్థాపకులు శ్రీరాములు, ఉపాధ్యాయులు పోతంశెట్టి రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా పడి రైతుకు తీవ్ర గాయాలు

నిమ్మనపల్లి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ బోల్తా పడడంతో రైతుకు తీవ్ర గాయాలు అయిన సంఘటన గురవారం మండలంలో చోటు చేసుకొంది. స్థానికుల వివరాల మేరకు మదనపల్లి మండలం బుగ్గకాలువకు చెందిన నరసింహులు ట్రాక్టర్‌పై తన సొంత పనుల నిమిత్తం నిమ్మనపల్లి బయలు దేరి వస్తుండగా మార్గ మధ్యంలో మర్రిబండ వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించ బోయి పక్కనే కాలువలోకి ట్రాక్టర్ బోల్తా పడింది. దీంతో నరసింహులు కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 సాయంతో మదనపల్లి ఆసుపత్రికి తరలించారు.

టీడీపీ బ్యానర్ తొలగింపుపై ఇరువర్గాల ఘర్షణ

బసినికొండలో ఉద్రిక్త వాతావరణం

మదనపల్లె అర్బన్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం బసినికొండలో టీడీపీ బ్యానర్‌ను తొలగించడంపై ఇరువర్గాలు గురువారం ఘర్షణ పడ్డారు. బంకుకు అడ్డుగా ఉందని టీడీపీ బ్యానర్‌ను తొలగించారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ కార్యకర్తలు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకుని చందు అనే యువకుడిని కొట్టడంతో గొడవ మొదలైంది. అక్కడ బంకు నిర్వహిస్తున్న వారి తరపున వైసీపీ కార్యకర్తలు అక్కడికి చేరుకోవడంతో గొడవకు ఆజ్యం పోసినట్లు అయింది. గొడవ మరింత ఎక్కువ కావడంతో తాలుకా సీఐ కళావెంకటరమణ తన సిబ్బందితో అక్కడికి చేరకుని ఇరువర్గాలతో మాట్లాడి గొడవను సర్దుమణిగించారు.

10న విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం

పీలేరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఈ పీలేరు మండల విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నెల 10వ తేదీన ఏర్పాటు చేసినట్లు పీలేరు తహసీల్దారు భీమేశ్వర రావు తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో జరిగే సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు, ఎన్‌జీవోలు, విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు.

రేపు ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

మదనపల్లె అర్బన్, జనవరి 2(ఆంధ్ర.జ్యోతి): స్థానిక ఆర్యవైశ్య హాస్టల్‌లో వాసవీక్లబ్ అండ్ వాసవీ వనితాసెంట్రల్, మదనపల్లె ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం శనివారం నిర్వహిస్తున్నట్లు మదనపల్లె ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఓంప్రకాష్ తెలిపారు. ఇందులో మల్టీస్పెషాలిటీ ఆయుర్వేదక్ హాస్పిటల్ అండ్ అడ్వాన్స్‌డ్ అనోరెక్టల్ సెంటర్ డాక్టర్లు యిక్కులూరి రూపేష్, మౌనీశ్వరి వైద్య పరీక్షలు చేస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జిల్లా ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా కోటేశ్వరి



మదనపల్లె అర్బన్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ అండ్ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ కోటేశ్వరి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ కోటేశ్వరి మాట్లాడుతూ పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తామన్నారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కారిస్తా మని తెలిపారు.

పందేనికి కోళ్లు రెఢీ..!

- సంక్రాంతికి భారీగా నిర్వహించేందుకు కసరత్తు



గుర్రంకొండ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగకు కోడి పందేలు నిర్వహించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే పందెం కోళ్లను సిద్ధం చేసుకుని, బరిలో దిగి పోరాడేందుకు వాటికి తర్ఫీదు కూడా ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఇందుకో సం కోళ్లను కొందరు పందెంరాయుళ్లు బయట రాష్ట్రాల నుంచి తెప్పించి, సంక్రాంతికి భారీ స్థాయిలో పందేలు నిర్వహించాలని కొందరు నిర్వాహకులు కసరత్తును మొదలుపెట్టారు. ఈ క్రమంలో కొత్త సంవత్సరం రోజున కొన్ని గ్రామాల్లో కోడిపం దేలు యథేచ్ఛగా సాగించారు. ఇదే ఊపుతో సంక్రాంతి పండుగ సందర్భంగా ఇంకా భారీ స్థాయిలో నిర్వహించాలని ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. గుర్రంకొండ మండలంలో 15 పంచాయతీలు, సుమారు 175 గ్రామాలున్నాయి. కొన్ని గ్రామాల్లో మాత్రం అటవీ ప్రాంతం విస్తారంగా ఉంది. ఇదే అదునుగా భావించిన కోడిపందెం నిర్వాహకులు గుట్టుచప్పుడు కాకుండా కోడిపందేలను నిర్వహిస్తున్నారు. దీనికి తోడు సంక్రాంతి పండుగ రానున్నడంతో ఇప్పటి నుంచే నిర్వాహకులు కోడిపందెంకు కసరత్తు చేస్తున్నారు. మండలంలోని టి.పసలవాండ్లపల్లె, ఎల్లుట్ల, నడిమిఖండ్రిగ, శెట్టివారిపల్లె, బోడిగుట్ట, మర్రిపాడు, టి.రాచపల్లె, తరిగొండ, మర్రిమాకులపల్లె, సంగసముద్రం గ్రామాల్లో సంక్రాంతి పండుగకు కోడిపందేలు నిర్వహించడానికి నిర్వాహకులు, పందెంరాయుళ్ల ఉత్సాహంలో ఉన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు : సీఐ



వాల్మీకిపురం, జనవరి 2 (ఆం ధ్రజ్యోతి): కోడి పందేలు, పేకాట, జూదం నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని వాల్మీకిపురం సీఐ ప్రసాద్‌బాబు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో జూదాలను అరికట్టే దిశగా ముమ్మర నిఘా పెట్టామన్నారు. ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలని, కోడి పందేలలో కోళ్లకు కత్తులు కట్టి గుంపులుగా చేరి పందేలు కాయడం తద్వారా ఏవైనా పరిణామాలు చోటుచేసుకుంటే పట్టుబడిన నిర్వాహకులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. పేకాట, జూదం ఆడుతూ పట్టుబడితే ఎంతటివారైనా ఉపేక్షించక చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. సర్కిల్ పరిధిలోని గుర్రంకొండ, వాల్మీకిపురం మండలాల్లో ఇప్పటికే ముమ్మర నిఘా పె ట్టామని, కోడి పందేలు, పేకాట, జూదంపై సమాచారమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

హైస్కూలులో మంచినీటి పైపులైన్ ఏర్పాటు


విద్యార్థులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

తంబళ్లపల్లె, జనవరి 2(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె ఉన్నత పాఠశాలకు మంచినీటి కోసం పైపులైను ఏర్పాటు చేయిస్తున్న ట్లు మల్లయ్యకొండ మాజీ చైర్మన్ కనుగొండ మద్దిరెడ్డి తెలిపారు. గురువారం మద్దిరెడ్డి కుమారుడు గౌతం రెడ్డి జన్మదినం సందర్భంగా స్థానిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఎంఈవో త్యాగరాజు ఆధ్వర్యంలో స్వీట్లు పంచిపెట్టి, అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా కనుగొండ మద్దిరెడ్డి మాట్లాడుతూ...తన కుమారులు చదువుకున్న పాఠశాలకు ఏదో ఒకటి చేయాలనే తపనతో ప్రతి ఏడాది జన్మదినం రోజున పాఠశాలల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ ఏడాది సుమారు రూ.50వేలతో పాఠశాలకు మంచినీటి పైపు లైను వేయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ శివకుమార్, హెచ్‌ఎం శ్రీనివా సులు, కురవంక సర్పంచ్ చలపతి, రామ్మోహన్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, రమణారెడ్డి, శివరాం తదితరులు ఉన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు సర్టిఫికెట్లు పంపిణీ


భవన నిర్మాణ కార్మికుల సర్టిఫికెట్స్ అందజేస్తున్న దృశ్యం

మదనపల్లె అర్బన్, జనవరి 2(ఆంధ్రజ్యోతి):ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం ద్వారా మదనపల్లెలోని ధాత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం ట్రైనింగ్ సర్టిఫికెట్లు మదనపల్లె ప్రాంతీయ రవాణాశాఖాధికారి శివలింగ పంపిణీ చేశారు. ఈ సందర్భంవగా ఆయన మాట్లాడుతూ స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన ట్రైనింగ్ సెంటర్‌లో ఏడు రోజులుపాటు తాపీమేస్త్రీలు శిక్షణ పొందారన్నారు. ట్రైనింగ్ సర్టిఫికెట్ పొందిన వారికి ఎటువంటి పూచీకత్తు లేకుండా లక్ష రూపాయల వరకు రుణం పొందవచ్చన్నారు. శిక్షణ కాలంలో రోజుకు ఐదువందల రూపాలు స్టైపండ్, 15 వేలు రూపాయలు విలువ చేసే టూల్ కిట్ ఉచితంగా అందించినట్లు ధాత్రి ఫౌండేషన్ నిర్వాహకులు డాక్టర్ స్వాతి చక్రపాణి తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఎం విశ్వకర్మ యోజన ట్రైనింగ్‌కో ఆర్డినేటర్ శంకరయ్య, సిబ్బంది ప్రసన్న, వినీత పాల్గొన్నారు.

కురబలకు నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యమివ్వండి


బీజేపీ అధ్యక్షురాలికి వినతి పత్రం ఇస్తున్న కురుబ సంఘం నేతలు

మదనపల్లె, జనవరి 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 20 లక్షల జనాభా కలిగిన కురబలను గుర్తించి నామినేటెడ్ పోస్టులలో ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర కురుబ సంఘం అధ్యక్షుడు జబ్బల శ్రీనివాసులు బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ పురంధేశ్వరిని కోరారు. గురువారం కురుబ సంఘం నాయకులు వశికేశి లింగమూర్తి, చిరుతల విఠల్ గౌడ్, కాటమయ్య, కురుబ యువత ప్రధాన కార్యదర్శి దండు కేశవ, కురుబ యువ ఉపాధ్యక్షులు బండి కాశి, వశివేరి శివలు విజయవాడలోని బీజేపీ కార్యాలయంలో పురంధేశ్వరిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బీసీ కులాలలో అత్యధిక జనాభా కలిగిన కురబలను గుర్తించి ఒక ఎంఎల్‌ఏ, రెండు ఎంపీ, మంత్రి పదవులు ఇచ్చిన టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా రాబోయే కాలంలో కురుబ కులస్థులకు మరిన్ని నామినేటెడ్ పోస్టులలో ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

సీమ రజకులకు ఆర్థిక సహకారం అందించాలి

కలికిరి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ ప్రాంతంలోని రజకుల కు ఆర్థిక సహకారం అందించి అన్ని విధాల ఆదుకోవాలని అన్నమయ్య జిల్లా టీడీపీ రజక విభాగం కన్వీన రు జ్ఞానమూర్తి కోరారు. కొత్తగా ఏర్పాటైన రజక కార్పొరేషన్ ద్వారా సీమ రజకులకు ఆర్థిక సహకారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా నియమితులైన సావిత్రి గురువారం పదవీ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా రజక ప్రాధికార కమిటీ రాష్ట్ర సభ్యుడు రామమూర్తితో కలిసి ఆమెను అభినందించారు. ఈ సందర్భంగా జ్ఞానమూర్తి మాట్లాడుతూ కార్పొరేషన్ ద్వారా రజకుల ఆర్థిక, సామాజిక స్థితిగతులు మారే విధంగా నిధులు మంజూరు చేసి చేయూతనివ్వాలని కోరారు.

వేగవంతంగా గోకులం షెడ్ల నిర్మాణ పనులు


బూర్లపల్లెలో నిర్మిస్తున్న గోకులం షెడ్లను పరిశీలిస్తున్న అధికారులు

పెద్దతిప్పసముద్రం జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి పథకం ద్వారా చేపట్టిన గోకులం షెడ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్ సూచించారు. 100 శాతం సబ్సిడీ ద్వారా మంజూరు చేసిన గోకులం షెడ్లలో మొదటి విడతగా పీటీఎం మండలానికి 50 యూనిట్లను మంజూరు చేశారన్నారు. సంక్రాంతి పండుగకు పనులను పూర్తి చేసి గోకులం షెడ్లను ప్రారంభం చేయాలని ప్రభుత్వం నిర్దేశించిందన్నారు. ఇందులో భాగంగా గురువారం మండలంలోని బూర్లపల్లె గ్రామంలో నిర్మాణంలో ఉన్న గోకులం షెడ్లను ఎంపీడీవో, ఉపాధిహామీ ఏపీవో తిరుపాలప్పతో కలిసి పనులను పరిశీలించారు. గడువులోగా పనులను పూర్తి చేయాలన్నారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికే ఎస్‌ఎంసీలు

పీలేరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడం కోసమే ప్రభుత్వం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్‌ఎంసీ)లు ఏర్పాటు చేసిందని పీలేరు ఎంఈవోలు లోకేశ్వర రెడ్డి, పద్మావతమ్మ పేర్కొన్నారు. పీలేరు మండలంలోని ఎస్‌ఎంసీల చైర్మన్‌లు, హెచ్‌ఎంలకు ఒక రోజు మండలస్థాయి శిక్షణ కార్యక్రమాన్ని గురువారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. అనంతరం రిసోర్స్ పర్సన్‌లు ఓబుల్ రెడ్డి, నజీర్, సురేశ్ కుమార్, అల్తాఫ్ పలు అంశాలను వివరించారు. హెచ్‌ఎంలు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో: పాఠశాలల అభివృద్ధిలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల (ఎస్‌ఎంసీ) పాత్ర కీలకమని ఎంఈవోలు త్యాగరాజు, సీఆర్ నాగసుబ్బరాయుడు పేర్కొన్నారు. గురువారం స్థానిక విద్యా వనరుల కేంద్రంలో మండలంలోని 69 ప్రభుత్వ పాఠశాలల ఎస్‌ఎంసీ చైర్మన్‌లు, హెచ్‌ఎంలకు ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రిసోర్స్ పర్సన్స్ కేవి సత్యనారాయణ రావు, సాంబశివ, రామచంద్రారెడ్డిలు.. ఎస్‌ఎంసీ సభ్యుల విధులు, బాధ్యతలు,తదితర అంశాలపైన అవగాహన కల్పించారు. అనంతరం ఎంఈవోలు మాట్లాడుతూ.. జనవరి 3 నుంచి 6 వరకు పాఠశాల స్థాయిలో యాజమాన్య కమిటీ సభ్యులకు శిక్షణ ఉంటుందన్నారు.

నిమ్మనపల్లిలో:తల్లిదండ్రులతో పాటు ఎస్‌ఎంసీ చైర్మన్‌లు, ప్రధానోపాధ్యాయులు కలసికట్టుగా పాఠశాలల అభివృద్ధికి కృషిచేయాలని ఎంఈవో-1 పద్మావతి, ఎంఈవో-2 నారాయణ పేర్కొన్నారు. గురువారం స్థానిక జడ్పీహైస్కూల్‌లో ఎస్‌ఎంసీ చైర్మన్‌లు, ప్రధానోపాధ్యాయులు సమావే శం నిర్వహించారు. ఎస్‌ఎంసీ చేర్మన్ క్రిష్ణయ్య, సీఆర్పీలు పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రంలో: ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ కమిటీ చైర్మన్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సమన్వయంతో పని చేసి పాఠశాలలను బలోపేతం చేసుకోవాలని జిల్లా సర్వశిక్ష అభియాన్ సీఎంవో కరుణాకర్ పేర్కొన్నారు. గురువారం స్థానిక పీటీఎంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (తెలుగు) లో మండలంలోని వివిధ పాఠశాలల్లో నూతనంగా నియమితులైన పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్‌లు, హెచ్‌ఎంలకు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంఈవో నారాయణ, గొస్‌పీర్, ఆర్పీలు లక్ష్మీనారాయణ, రెడ్డెప్పరెడ్డి, శ్రీపతి పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు స్టడీ మెటీరియల్ వితరణ

రామసముద్రం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పేద విద్యార్థులకు యూటీఎఫ్‌చే తయారు చేసిన సుమారు రూ.15వేలు విలువ చేసే ఎస్‌ఎస్‌సీ స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులకు అందచేశారు. కార్యక్రమంలో ఎంఈవో అంజనేయులు, ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మునిస్వామి నాయక్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సచివాలయాల పరిశీలన

పెద్దతిప్పసముద్రం జనవరి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగసముద్రం, మడుమూరు సచివాలయాలను ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్ గురువారం పరిశీలించారు. సచివాలయాల్లో సచివాలయ ఉద్యోగుల హాజరు రికార్డులను పరిశీలించారు.

హిందూ శ్మశానవాటిక అభివృద్ధికి సహకారం

మదనపల్లె టౌన్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మదనపల్లె-నిమ్మనపల్లె మార్గం లోని హిందూ శ్మశానవాటిక అభివృద్ధికి పలువురు దాతలు సహకారం అందించారు. గురువారం మాజీ సైనికోద్యోగి కంచెర్ల శ్రీనివాసులునాయుడు ఆధ్వర్యంలో హిందూ శ్మశానవాటిక అభివృద్ధి పనులకు భూమి పూజ చేసి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మా ట్లాడుతూ శ్మశానవాటిక కోసం ప్రభుత్వం కేటాయించిన 6.32 ఎకరాల స్థలంలో ముళ్లకంపల చెట్లు పెరిగిపోయాయని శ్రీనివాసులునాయుడు తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. దీంతో శ్మశానవాటిక చుట్టూ ప్రహరీతో పాటు ఇతర అభివృద్ధి పనులకు తన సొంత నిధులు రూ.లక్ష ఇస్తానని హామీ ఇచ్చారు. దీంతో పెద్దఎత్తున దాతలు ముందుకొచ్చి సుమారు రూ.5లక్షలు విరాళాలు ప్రకటించారు. జనసేన నేత శ్రీరామాంజనేయులు రూ.50వేలు, కౌన్సిలర్ నాగార్జునబాబు రూ.50వేలు, విక్రమ్ రూ.25వేలు, మేస్త్రీ రమణ రూ.25వేలు, ఇతరులు మిగిలిన మొత్తం విరాళం ప్రకటిం చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆర్‌జే వెంకటేశ్, నవీన్‌చౌదరి, కత్తిలక్ష్మన్న, బి.వెంకటరమణ, మునిరత్నం, హరి, చిన్నమహేష్, వేణు, విజయమ్మ, ఉషారాణి పాల్గొన్నారు.

భూసమస్యలపై అధికంగా అర్జీల వెల్లువ


మాలేపాడులో రెవెన్యూ సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

మదనపల్లె టౌన్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): తమ భూములు భాగపరిష్కారం చేసుకున్నామని, భూములను సబ్ డివిజన్ చేసి తమకు పాసుపుస్తకాలు మంజూరు చేయాలని అధికంగా ప్రజలు అర్జీలు అందజేశారు. గురువారం మండలంలోని మాలేపాడులో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల మాలేపాడులో ఫ్రీహోల్డ్ కింద పెట్టిన భూముల రిజిస్ట్రేషన్ నిలుపుదల చేశారని, వాటిని మళ్లీ రిజిస్ట్రేషన్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు విన్నవించారు. పాసుపుస్తకాల మంజూరు, సర్వే సమస్యలపైనే అధికంగా ప్రజలు అర్జీలు ఇచ్చారు. ఈ సందర్భంగా డిప్యూటీ కలెక్టర్ రాఘవేంద్ర మాట్లాడుతూ ప్రజలు ఇచ్చిన అర్జీలను నిర్ణీత సమయంలో పరిష్కారం చేస్తామని, వీలుకాని అర్జీలకు గల కారణాల కూడా ఎండార్స్‌మెంట్ ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌డీవో అమరనాథరెడ్డి, తహసీల్దార్ ఖాజాబీ, రెవిన్యూ పంచాయతీరాజ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

గుర్రంకొండలో:ప్రభుత్వ భూములను ఎవరైనా సరే ఆక్రమిస్తే చర్యలు తప్పవని తహశీల్దార్ శ్రీనివాసులు హెచ్చరించారు. మండలంలోని శెట్టివారిపల్లెలో గురువారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూములను ఎవరైన ఆక్రమించి వారి వివరాలను సేకరించాలన్నారు. అనంతరం ప్రజలు, రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి లక్ష్మీపతి, వీఆర్వో నారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో: రైతుల భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ పామిలేటి కోరారు. గురువారం మండలంలోని జమ్మ్లపల్లె గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించి రైతుల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో స్పెషలాఫీసర్ లక్ష్మీప్రసన్న, వివిధ శాఖల అధికారులు, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పెద్దమండ్యంలో: ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా గ్రామాల్లో నిర్వహిస్తున్న రైతు సదస్సుల్లో భూ సమస్యలు పరిష్కరించుకోవడానికి మంచి అవకాశమని హౌసింగ్ ఈఈ వెంకటదాస్, తహసీల్దార్ సయ్యద్ ఆహ్మద్ పేర్కొన్నారు. మండలంలోని పాపేపల్లిలో గురువారం రైతు సదస్సులో రైతుల నుంచి భూసమస్యలతో పాటు పలు శాఖల సమస్యలపై అర్జీలను స్వీకరించారు. కూటమి నేతలు మహేంద్ర, గల్లా నారాయణ, సురేష్, సర్పంచ్ పీరమ్మ, డీఈ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వందల సంఖ్యలో ఎమ్మెల్యేకు వినతులు

మదనపల్లె టౌన్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఓ వైపు నియోజకవర్గంలో రెవెన్యూ సదస్సులు జరుగుతున్నా, ప్రతి సోమవారం పీజీఆర్‌ఎస్ కార్యక్రమంలో వినతులు స్వీకరిస్తున్నా, ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు మాత్రం ప్రజల నుంచి వందల సంఖ్యలో వినతులు వస్తూనే ఉన్నాయి. మూడు మండలాలతో పాటు మదనపల్లె పట్టణ ప్రజలు ప్రతి రోజు ఎమ్మెల్యే నివాసం వద్దకు వచ్చి తమ సొంత సమస్యలు, గ్రామ సమస్యలు, ప్రజాప్రయోజనాలపై వినతులు ఇస్తూనే ఉన్నారు. గురువారం స్థానిక ఎమ్మెల్యే నివాసం వద్ద వందకు పైగా అర్జీదారులు బారులు తీరి తమ సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించుకున్నారు. వాటిని ఆయా ప్రభుత్వ అధికారులకు రెఫర్ చేయడంతో పాటు, కొన్నింటి ఎమ్మెల్యేనే ఆ అధికారులకు ఫోన్‌లు చేసి పరిష్కరించాలని సూచించారు. మొత్తం మీద వైసీపీ ఐదేళ్ల పాలనలో నిలిచిపోయిన సమస్యలన్ని ఇప్పుడు ఆరు నెలలుగా పరిష్కారం కోసం అటు ఎమ్మెల్యే, ఇటు అధికారుల వద్దకు వెళ్లువలా వస్తున్నాయి.

ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో సమస్యలు పరిష్కరిస్తాం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో పరమేశ్వర్‌రెడ్డి

నిమ్మనపల్లి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించనున్నట్లు ఎంపీడీవో పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థాని పంచాయతి పెద్దమాదిగపల్లిలో పౌరహక్కుల సమావేశం నిర్వహించారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో ఉన్న సమస్యలను తెలుసుకొనేందుకు సమావేశాలు నిర్వహించి గ్రామస్థుల నుంచి అర్జీలను స్వీకరించి వాటిని రికార్డు చేసి పరిష్కరించనున్నట్లు తెలిపారు. అనంతరం గ్రామస్థులు మాట్లాడుతూ పది మంది నడిచే దారిలో ఓ వ్యక్తి చెట్లు పెంచి సమస్యను తెస్తున్నట్లు తెలిపారు. అలాగే గ్రామాలలో మురుగునీటి కాలువలు, రోడ్లు నిర్మించాలని, పింఛన్‌లు, శ్మశానాలకు భూమి కేటాయించి ఎస్సీ ఎస్టీ రుణాలను మంజరు చేయాలని కోరారు ఎన్ని సార్లు సమావేశాలు జరిగినా తమ సమస్యలు పరిష్కారం కాలేదని గ్రామస్థులు వాపోయారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 నారాయణ, ఏపీవో రమేష్, ఏపీఎం మురళి, సీఎస్‌డీటీ సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ములకలచెరువులో క్రికెట్ టోర్నమెంటు

ములకలచెరువు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగను పురష్కరించుకుని ఈ నెల 9వతేదీ నుంచి ములకలచెరువులో కట్టా క్రికెట్ టోర్నమెంటును నిర్వహిస్తున్నట్లు టీఎన్‌ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత కట్టా దొరస్వామినాయుడు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ములకలచెరువులో టోర్నమెంటుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టోర్నమెంటులో విజేతగా నిలచిన జట్టుకు రూ.1,00,116, రన్నర్స్ జట్టుకు రూ.50,116లు అందజేస్తానన్నారు. ఈ నెల 5వతేదీ లోగా జట్ల పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో యువకులు కట్టా విజయ్‌నాయుడు, వెంకీ, సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాన్ని ఆపాలంటూ ఫిర్యాదు

గుర్రంకొండ, జనవరి 2(ఆంధ్రజ్యోతి):పశువుల మంద స్థలంలో అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాన్ని ఆపాలంటూ తల్లారివాండ్లపల్లె గ్రామస్థులు గురువారం తహశీల్దార్ శ్రీనివాసులకు ఫిర్యాదు చేశారు. మండలంలోని గుర్రంకొండ పంచాయతీ తల్లారివాండ్లపల్లెలో సర్వే నెంబరు 617/1, 617/12లో ప్రభుత్వ భూమిలో గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అక్రమంగా ఇంటి నిర్మాణం చేపట్టాడని గ్రామస్థులు ఫిర్యాదు చేయడంతో అక్కడకు చేరుకొని సిబ్బందితో మాట్లాడి భూమి వివరాలను సేకరించారు. రెవెన్యూ అధికారులు పూర్తి సర్వే నెంబరుకు హద్దులు కేటాయించి ఆక్రమణలను గుర్తించాలని సూచించారు. అప్పటి వరకు అక్రమంగా నిర్మిస్తున్న ఇంటి పనులను ఆపాలని సూచించారు. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.